మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 6-1-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 188 Issue: 188

06 జనవరి 2026 - మంగళవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షణాయనం - హేమంత ఋతువు పుష్య మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:51 సూర్యాస్తమయం - సా. 5:52 తిథి తదియ ఉ. 8:03 వరకు తరువాత చవితి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం ఆశ్లేష మ. 12:18 వరకు తరువాత మఖ యోగం ప్రీతి రా. 8:26 వరకు కరణం విష్టి ఉ. 8:03 వరకు బవ రా. 7:27 వరకు వర్జ్యం రా. 12:06 నుండి రా. 1:41 వరకు దుర్ముహూర్తం ఉ. 9:03 నుండి ఉ. 9:47 వరకు రా. 11:03 నుండి రా. 11:55 వరకు రాహుకాలం మ. 3:07 నుండి సా. 4:29 వరకు యమగండం ఉ. 9:36 నుండి ఉ. 10:59 వరకు గుళికాకాలం మ. 12:21 నుండి మ. 1:44 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:15 నుండి ఉ. 6:03 వరకు అమృత ఘడియలు ఉ. 10:44 నుండి మ. 12:16 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:59 నుండి మ. 12:43 వరకు గమనిక: (oc అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com



ఓవైపు గంగా, పద్మా నదుల ప్రవాహాలు..
మరోవైపు హిందువుల ఆర్తనాదాలు..
కాలిపోతున్న హిందూ దేవాలయాలు..
దోపిడీకి గురవుతున్న మైనారిటీల ఇళ్లు..
చెట్టుకు కట్టేసి ఒకరి సజీవ దహనం..
కనిపిస్తే ఇంకొకరి మానభంగం..
హత్యలు, అత్యాచారాలు, ఆస్తుల ఆక్రమణలు..
వినిపించడం లేదు ఏ ఒక్కరికీ ఆ వేదనలు..
ఇదీ బంగ్లాదేశ్ భారతం..! కనికరం లేని ప్రపంచం..!!

# బంగ్లా భారతం

# వినేదెవ్వరు?

బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై జరిగిన దాడులు, హింస, ఆస్తిపాస్తుల విధ్వంసం అత్యంత ఆందోళనకరంగా తయారైంది. ప్రపంచంలో ఏ మూలన చిన్న సంఘటన జరిగిన ఏదో జరిగి పోయినట్లు స్పందించే భారతీయ మీడియా, మేధావులు, వామపక్షాలు.. బంగ్లాదేశ్ అకృత్యాలపై మాత్రం సైలెంట్‌గా ఉండిపోతున్నారు. సాత్రానికి స్టేట్‌మెంట్లు, ట్రోల్స్‌తో సరిపెడుతున్నారు. మైనారిటీల భద్రత, మానవ హక్కులపై ఆందోళనలు వ్యక్తం అవుతున్నా.. భారతీయ సమాజం కూడా పెద్దగా స్పందించకపోవడం దారుణం. గాజాలో మారణహోమాన్ని నిర్వంధ్వంగా ఖండించిన నోళ్లు.. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దారుణాలపై మాత్రం మాట మాట్లాడకపోవడం శోచనీయం.

## పొరుగు దేశంలో మైనారిటీల ఊచకోత

## ఏడాదిలోనే 2,900 హింసాత్మక దాడులు

### 183 మందికి పైగా హిందువుల మృతి.. పెరిగిపోయిన దేవాలయాల విధ్వంసం

### కనీసం స్పందించని భారతీయ హిందువులు.. పట్టనట్టుగా వామపక్షాల వ్యవహారం



(ఈవార్తలు స్పెషల్ స్టోరీ)

దౌత్యపరమైన మార్గాల ద్వారా బంగ్లాదేశ్ ప్రభుత్వంతో భారత ప్రభుత్వం సంప్రదించిందని, మైనారిటీల భద్రతపై ఆందోళన వ్యక్తం చేసిందని నివేదికలు వచ్చాయి. బంగ్లాదేశ్‌లోని మైనారిటీల రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు సమాచారం వచ్చింది. కానీ, అది సరిపోతుందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పాలస్తీనాకు మద్దతుగా బ్యాగులు వేసుకొని పార్లమెంటుకు వచ్చిన కాంగ్రెస్ పెద్దలు .. బంగ్లాదేశ్ అకృత్యాలపై ఏ నిరసనా వ్యక్తం చేయలేదు. కనీసం స్పందించలేదు.

**పట్టించుకోని భారతీయ హిందూ సమాజం**

హిందువుల్లో చైతన్యం తక్కువేనన్న అభిప్రాయం ఉంది. దాన్ని భారతీయ హిందువులు నిజం చేస్తున్నారేమోనన్న అనుమానం కలుగుతోంది. సంసారం, -2 వ పేజీలో...



## పోదాం పదండి.. మేడారం

### మహా జాతరకు రంగం సిద్ధం

### 28 నుంచి 31 వరకు కార్యక్రమం

### సీఎం, మంత్రులకు ఆహ్వానాలు

శాసనసభలో మేడారం మహా జాతర సందడి నెలకొంది. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ ధర్మాదాయ అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు పలువురు మంత్రులకు మేడారం మహా జాతర ఆహ్వాన పత్రికలను అందజేశారు.

హైదరాబాద్, జనవరి 5 (ఈవార్తలు): ఈ సందర్భంగా మేడారం ఈవో వీరస్వామి, సమ్మక్క-సారలమ్మ పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పలువురు పూజారులు.. ఆలయ సంప్రదాయం ప్రకారం కంకణం కట్టి, కండువా కప్పి, బంగారం అందజేసి మేడారం జాతరకు ఆహ్వానించారు. ప్రముఖులకు అధికారికంగా ఆహ్వాన పత్రికలు అందజేసి మహా జాతరకు రావాలని మంత్రులను కోరారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు ఆహ్వాన పత్రికను అందించారు. ఈ నెల 28 నుంచి 31 వరకు మేడారం మహా జాతర జరగనుంది. మేడారం అభివృద్ధికి ప్రభుత్వం రూ.230 కోట్లతో విస్తృత పనులు చేపట్టింది. 9న సమ్మక్క-సారలమ్మల గద్దెలు, ఆలయ ప్రాంగణ పునరుద్ధరణ పనుల ప్రారంభోత్సవాన్ని ముఖ్యమంత్రి నిర్వహించనున్నారు.

**బంగారం-వెండి ధరలు**

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,822 |
| వెండి (గ్రాము): | రూ.265 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,340 |

## కవిత కన్నీళ్లు!

### స్వరాష్ట్రం ఏర్పడ్డాక నాపై ఆంక్షలు

### పార్టీని ప్రశ్నిస్తే పగబట్టారు.. నాది ఆస్తి పంచాయితీ కాదు

**ఆత్మగౌరవ పంచాయతీ.. వ్యక్తిగా వెళ్లి శక్తిగా తిరిగొస్తా.. శాసమండలిలో కల్వకుంట్ల కవిత**



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శాసనమండలిలో కన్నీరు పెట్టుకున్నారు. కవిత సోమవారం రోజున శాసనమండలిలో మాట్లాడుతూ... 'నేను గతేడాది సెప్టెంబర్ 3వ తేదీన స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేశాను. అయితే మీరు (శాసనమండలి ఛైర్మన్) నన్ను ఆలోచించుకోమని చెప్పారు. అయితే ఆ తర్వాత పలు వేదికల నుంచి రాజీనామాను ఆమోదించమని రిక్వెస్ట్ చేశాను.

హైదరాబాద్, జనవరి 5 (ఈవార్తలు): నాలుగు నెలలు గడిచిన మీరు రాజీనామాను ఆమోదించలేదు. అందుకే ఈరోజు మిమ్మల్ని సమయం అడిగి.. ఫ్లోర్‌లో మాట్లాడి నేను ఈ నిర్ణయం తీసుకోవడానికి కారణాన్ని ప్రజలకు తెలియజేయాలని భావిస్తున్నాను' అని తెలిపారు. పెద్ద సభలో కూరొచ్చే అవకాశం ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీకి, నిజామాబాద్‌లో తనకు ఓటు వేసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు థాంక్స్ చెబుతున్నట్టుగా తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి తనకు అనేక కట్టుబాట్లు ఎదురవుతున్నాయని, ఈ క్రమంలోనే ఆ పార్టీ నుంచి సంక్రమించిన ఎమ్మెల్సీ తరువాయి 2 వ పేజీలో...



## హరీశ్‌కు రిలీఫ్

### ఫోన్ ట్యాపింగ్ కేసులో ఊరట

### రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ/హైదరాబాద్, జనవరి 5 (ఈవార్తలు): ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీశ్ రావుకు బిగ్ రిలీఫ్ దక్కింది. ఈ కేసులో హరీశ్‌రావు, మాజీ డీసీపీ రాధాకిషన్‌రావులకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరీశ్‌రావు, రాధాకిషన్ రావు ఫోన్ ట్యాపింగ్ చేశారని సిద్దిపేటకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ 2024లో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు కూడా చేపట్టారు. అయితే ఈ ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని హరీశ్‌రావు అదే ఏడాది డిసెంబర్‌లో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. హరీశ్, రాధాకిషన్‌పై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను హైకోర్టు క్వాష్ చేసింది. ఈ క్రమంలోనే హైకోర్టు తీర్పును తెలంగాణ ప్రభుత్వం సవాల్ చేయగా సుప్రీం పిటిషన్ ఆ పిటిషన్‌ను కొట్టేసింది. అయితే హరీశ్‌రావుపై ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయడం సరికాదంటూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టులో మరోసారి స్పెషల్ లీవ్ పిటిషన్ తరువాయి 2 వ పేజీలో...

**విశ్వవాణి**




కొన్ని కంపెనీలు లాక్కున్న వారసత్వ భూమిని 120 ఏళ్ల తర్వాత తిరిగి చేజిక్కించుకుంది అమెరికా-కాలిఫోర్నియాలోని యురోక్ గిరిజన తెగ. క్లామత్ నది వెంబడి 47 వేల ఎకరాలను కబ్జా చేయగా, అక్కడి కోర్టు గిరిజన తెగకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది.

## బాలికలకూ మహిళా సంఘాలు

### వృద్ధులు, దివ్యాంగులకూ వర్తింపు.. మంత్రి సీతక్క కీలక ప్రకటన



హైదరాబాద్, జనవరి 5 (ఈవార్తలు): తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో కిశోర బాలికలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణలో మహిళా సాధికారతకు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా.. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నాల్గవ రోజు ప్రారంభం కాగా.. సభ మొదలైన వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుపై సభ్యులు ప్రశ్న అడగగా.. మంత్రి సీతక్క ఈ మేరకు -2 వ పేజీలో...



## కూర్చొని మాట్లాడుకోరాదా?

**పోలవరం-నల్లమల సాగర్‌పై సీజేఐ వ్యాఖ్య..సుప్రీంలో వాదనలు..విచారణ 12కి వాయిదా**

న్యూఢిల్లీ/హైదరాబాద్, జనవరి 5 (ఈవార్తలు): పోలవరం - నల్లమల సాగర్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఆంధ్రప్రదేశ్‌ఉల్లంఘనలకు పాల్పడటానికి సిద్ధమైందనేది ఆరోపణ అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. తెలంగాణ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీకి సుప్రీంకోర్టు సూచనలు ఇచ్చింది. కమిటీ ఏర్పాటు చేశారని మీరే చెబుతున్నారని, అన్ని తరువాయి 2 వ పేజీలో...




## టీజీ జనసేన కమిటీలు రద్దు

### కొత్తగా అడ్‌హాక్ కమిటీల ఏర్పాటు

### త్వరలోనే శాశ్వత కమిటీలు: జనసేన

హైదరాబాద్, జనవరి 5 (ఈవార్తలు): తెలంగాణలో జనసేన పార్టీకి కొత్త ఊపిరి పోసేలా హైకమాండ్ కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ - 2వ పేజీలో...

## రాశి ఫలాలు



6.1.2026

మేషం: నిరుద్యోగాలు ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి. వ్యాపార వ్యవహారాలలో లోటుపాట్లు సరిచేసుకుంటారు. గృహమున సంతాన శుభకార్య ప్రస్తావన వస్తుంది. ఆర్థిక పురోగతి కలుగుతుంది. అప్రయత్నంగా కొన్ని పనులు పూర్తి అవుతాయి. దూర ప్రాంత దైవ దర్శనాలు చేసుకుంటారు.

వృషభం: దైవ చింతన పెరుగుతుంది ఋణ ఒత్తిడి పెరుగుతుంది. వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ముఖ్యమైన పనులు మందగిస్తాయి. కుటుంబమున కొందరి మాటలు వివాదాస్పదంగా మారతాయి. ధన పరంగా ఇబ్బందులు తప్పవు. ఉద్యోగాలలో ఊహించని మార్పులు ఉంటాయి.

మిధునం: ఆప్తులతో మాటపట్టింపులు కలుగుతాయి. చేపట్టిన వ్యవహారాలు మరింతగా మందగిస్తాయి. మానసికంగా సమస్యలు కొంత బాధిస్తాయి. వృత్తి వ్యాపారాలలో నిరుత్సహ వాతావరణం ఉంటుంది. ఆదాయమార్గాలు మందగిస్తాయి. ఉద్యోగాలలో ఇతరుల నుండి విమర్శలు పెరుగుతాయి.

కర్కాటకం: ఉద్యోగమున ఒక సమాచారం ఆసక్తి కలిగిస్తుంది. వ్యాపారమున నూతన ఆలోచనలతో ముందుకు సాగుతారు. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగుల శ్రమ ఫలిస్తుంది. సంఘంలో పెద్దల నుండి ఆహ్వానాలు అందుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు.

సింహం: సంఘంలో పెద్దల పరిచయాలు అంతగా కలసిరావు. కుటుంబ సభ్యుల ప్రవర్తన కొంత చికాకు పరుస్తుంది. వృత్తి వ్యాపారాలలో ఒత్తిడి పెరుగుతుంది. ఉద్యోగమున శ్రమకు తగిన గుర్తింపు లభించదు. వృధా ఖర్చులు పెరుగుతాయి. ఆదాయానికి ఇబ్బంది తప్పదు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: దైవ కార్యక్రమాలకు ధన అందిస్తారు. స్థిరాస్తి క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. మొండి బాకీలు వసూలవుతాయి. వ్యాపారాలలో మెరుగైన లాభాలు పొందుతారు. ఉద్యోగులకు అనుకూలత పరిస్థితులుంటాయి. చుట్టుపక్కల వారితో వివాదాలలో పై చేయి సాధిస్తారు. రాజకీయ సభ సమావేశలకు హాజరవుతారు.

తుల: కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో వైద్యుని సంప్రదించడం మంచిది. చేపట్టిన పనులు అతికష్టం మీద పూర్తి అవుతాయి. వృత్తి, ఉద్యోగాలలో ప్రతికూల పరిస్థితులు వేదిస్తాయి. స్థిరస్తి సంభందిత విషయాలలో వివాదాలు తప్పవు. ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు అంతగా కలసిరావు.

వృశ్చికం: బంధు మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. సంఘంలో గౌరవ మర్యాదలకు లోటు ఉండదు. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. వ్యాపార వ్యవహారాలలో మీ అంచనాలు నిజం అవుతాయి. ఆర్థిక ఇబ్బందుల నుండి కొంత వరకు బయటపడతారు.

ధనస్సు: వృత్తి వ్యాపారాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులు నూతన అవకాశాలు అందిపుచ్చుకుంటారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేసి లాభాలు పొందుతారు. ఉద్యోగులు అధికారుల ఆదరణ పెరుగుతుంది. మిత్రులతో శుభకార్యాలకు హాజరవుతారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు వేగవంతం చేస్తారు.

మకరం: ఇతరులతో తొందరపడి మాట్లాడం మంచిది కాదు. దూర ప్రయాణ సూచనలున్నవి. ఉద్యోగాలలో సహోద్యోగుల ప్రవర్తన కొంత చికాకు కలిగిస్తుంది. వ్యాపారాలు ఆశించిన రీతిలో రాణించవు బంధు వర్గం వారితో మాటపట్టింపులంటాయి. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి.

కుంభం: వాహన ప్రయాణాలలో జాగ్రత్త అవసరం. కొన్ని పనులు అనుకున్న సమయానికి పూర్తికావు. ఖర్చులకు తగిన ఆదాయం లభించదు. ఉద్యోగమున స్థానచలన సూచనలున్నవి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. నూతన రుణయత్నాలు వ్యర్థంగా మిగులుతాయి.

మీనం: అన్ని రంగాల వారికి లాభదాయకంగా ఉంటుంది. వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. సంఘంలో పలుకుబడి పెరుగుతుంది. దైవ సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలలో సమస్యలు తొలగుతాయి. దీర్ఘ కాలిక వివాదాల నుండి ఉపశమనం పొందుతారు.

# బంగ్లా భారతం.. వినేదెవ్వరు?

మొదటి పేజీ తరువాయి

డబ్బు, విలాసాలు, నా ఇల్లు, నా కుటుంబం అనే ఛట్రంలోనే ఇరుక్కుపోయి సమాజాన్ని పట్టించుకోవడమే మానేశారన్న అపవాదు ఉంది. బంగ్లాదేశ్ ఘటనపై స్పందించకపోవడం చూస్తుంటే అదే అర్థం అవుతోంది.



### తెలియనట్లు వ్యవహరిస్తున్న సెలబ్రిటీలు

చిన్న సంఘటన జరిగినా, దాన్ని పెద్దది చేసేది సెలబ్రిటీలే. వీధి కుక్కలను కాపాడాలని రోడ్డుకెక్కిన ఆ సెలబ్రిటీలు.. బంగ్లాదేశ్ హిందువులపై మాత్రం కనీసం ఓ సోషల్ మీడియా పోస్టు చేయలేకపోతుండటం విచారకరం. సరే.. వేరే దేశాల వ్యవహారాలపై స్పందించరేమో! అనుకుంటే అది కూడా కాదు. రిప్, గెట్ వెల్ సూన్, దారుణం.. అమానుషం.. అంటూ కామెంట్లు చేసే సినీ, క్రీడా ప్రముఖులు.. బంగ్లాదేశ్ అంశంలో మాత్రం ఏ ప్రకటనా విడుదల చేయలేదు. జానీ కపూర్, కాజల్ అగర్వాల్ లాంటి అతి కొద్ది మాత్రమే సోషల్ మీడియా వేదికగా తమ అభిప్రాయాన్ని నిక్కచ్చిగా వ్యక్తం చేశారు. మరి మిగతావారికి ఎందుకంత పిరికి?

### కిక్కురుమనని మైనారిటీల పేటెంట్ వామపక్షాలు

మైనారిటీల రక్షణకే తాము ఉన్నదని డబ్బా కొట్టుకునే వామపక్షాలు.. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను మాత్రం ఖండించిన సందర్భాలు లేవు. నిన్నటికి నిన్న.. వెనెజువెలాపై అమెరికా దాడిని ఖండిస్తూ ర్యాలీలు, నిరసనలు చేపట్టిన కమ్యూనిస్టులు.. బంగ్లా హిందువులపై మాత్రం కనికరం చూపించలేకపోతున్నారు. ఎందుకిలా? అన్న ప్రశ్న ప్రతి హిందువు నుంచి ఎదురవుతున్నది.

### ఇటీవల చోటుచేసుకున్న దాడులు:

- బంగ్లాదేశ్‌లోని తాత్కాలిక ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి మైనారిటీలపై 2,900 కి పైగా హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయి.
- సంవత్సర కాలంలో దాదాపు 183 మందికి పైగా హిందువులు చనిపోయినట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. గత డిసెంబర్ నెలలోనే 8 మంది హిందువులు హత్యకు గురయ్యారు.
- 2024 ఆగస్టు నుండి 2025 జనవరి చివరి వరకు కనీసం 152 దేవాలయాలపై దాడులు, విధ్వంసం జరిగింది.
- 2025 మొదటి ఆరు నెలల్లోనే మైనారిటీ మహిళలపై 20కి పైగా అత్యాచార సంఘటనలు, అపహరణలు నమోదయ్యాయి.
- 2024 ఆగస్టులో జరిగిన అస్థిరత సమయంలో మైనారిటీ వర్గాలకు చెందిన 49 మంది ఉపాధ్యాయులను బలవంతంగా రాజీనామా చేయించారు.

### దారుణ హత్యలు:

- దీపూ చంద్ర దాస్ హత్య (డిసెంబర్ 2025): మైమెన్సింగ్ జిల్లాలో దీపూ చంద్ర దాస్ అనే హిందూ కార్మికుడిని దైవదూషణ ఆరోపణలతో అమానుషంగా కొట్టి, చెట్టుకు ఉరివేసి నిప్పంటించి చంపారు. విచారణలో ఆ ఆరోపణలకు ఆధారాలు లేవని తేలింది.
- వ్యాపారవేత్త ఖోకోన్ దాస్ మృతి (జనవరి 2026): దుండగుల దాడిలో గాయపడిన బెంగాలీ హిందూ వ్యాపారవేత్త ఖోకోన్ దాస్ ఈనెల 3న ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.
- జెస్సోర్ ప్రాంతంలో ఒక హిందూ యువకుడిని కాల్చిచంపారు. ఇది గత మూడు వారాలలో జరిగిన ఐదవ ప్రధాన దాడి.

### మరో హిందూ మహిళపై అత్యాచారం

ఢాకా: బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై దాడులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. తాజాగా ఓ హిందూ మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘోరం వెలుగులోకి వచ్చింది. జాతీయ మీడియాలలో వచ్చిన కథనం ప్రకారం బంగ్లాదేశ్‌లోని జ్వైనైదా జిల్లా కలిగంజ్ ప్రాంతంలో 40 ఏళ్ల హిందూ వితంతు మహిళపై ఇద్దరు స్థానికులు శనివారం అత్యాచారానికి పాల్పడ్డారు. అంతటితో ఆగకుండా ఆమెను చెట్టుకు కట్టేసి, జుట్టును కత్తిరించి, తీవ్రంగా హింసించారు. ఈ దారుణాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. బాధితురాలు కాలిగంజ్ మున్సిపాలిటీలోని వార్డు నంబర్ 7లో షాహిన్, అతని సోదరుడి నుంచి కొంత భూమిని, ఇంటిని కొనుగోలు చేసింది. ఈ కొనుగోలు తర్వాత షాహిన్ ఆమెకు అసభ్యకరమైన ప్రతిపాదనలు చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నాట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అతడి వేధింపులను మౌనంగా భరిస్తూ అతడి ప్రతిపాదనను నిరాకరించానని, అయితే గత శనివారం సాయంత్రం తన ఇంటికి ఇద్దరు బంధువులు వచ్చిన సమయంలో షాహిన్ అతడి సహచరుడు హసన్ ఇంట్లోకి ప్రవేశించి తనపై అత్యాచారానికి ఒడిగట్టారని పేర్కొంది. ఆ తర్వాత తన నుంచి రూ. 37 వేలు డిమాండ్ చేశారని డబ్బు ఇవ్వడానికి నిరాకరించడంతో ఆమె బంధువులను దాడి చేసి తరిమికొట్టారని ఫిర్యాదు చేసింది. వారి చర్యలతో కేకలు వేయడంతో తనను చెట్టుకు కట్టేసి, జుట్టును కత్తిరించి చిత్రహింసలకు గురి చేశారని పేర్కొంది. ఈ ఘటనలో స్పృహ కోల్పోయిన బాధితురాలిని స్థానికులు రక్షించి జునైదా సదర్ ఆసుపత్రిలో చేర్చారు.

# కవిత కన్నీళ్లు!

మొదటి పేజీ తరువాయి



పదవిని నిర్వహించడం నైతికత కాదని, అందుకే రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. తన రాజీనామాను ఆమోదించాలని కోరుతున్నానని తెలిపారు. బీఆర్ఎస్‌లో ఏ బాధ్యత ఇచ్చినా మనస్ఫూర్తిగా పనిచేశానని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరుగుతున్న తప్పులను అంతర్గత వేదికల్లో ప్రశ్నిస్తే తన మీద కక్షగట్టారని మండిపడ్డారు. ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడినవారిపై ఆంక్షలు విధించారని ఆరోపించారు. ఉద్యమకారుల విషయంలో కూడా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం రాకముందు రాష్ట్రం అంతటా తాను స్వేచ్ఛగా బతుకమ్మ వేడుకలు నిర్వహించానని తెలిపారు. 2014లో ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడిన తర్వాత... అదే ఏడాది సెప్టెంబర్‌లో జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ నిర్వహించామని, అప్పుడు తనపై ఆంక్షలు మొదలయ్యాయని కవిత అన్నారు.వ్యక్తి స్వేచ్ఛను ఎలా హరిస్తారనే బాధ, ఆవేదనతో ఈ మాటలు చెబుతున్నట్లు తెలిపారు.కేసీఆర్ తెలంగాణ రాకముందు కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేస్తామని చెప్పారని కవిత తెలిపారు. తెలంగాణ వచ్చాక బీఆర్ఎస్ హయాంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వ్యవస్థను పెంచి పోషించారని విమర్శించారు. అంతేకాకుండా ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను అమ్ముకున్నారని ఆరోపించారు. తెలంగాణ సమాజానికి ప్రశ్నించడం నేర్పిన బీఆర్ఎస్ పార్టీ తాను ప్రశ్నిస్తే తనపై పగబట్టారని అన్నారు. పార్టీ మౌత్ పీఎస్‌లుగా ఉండే పేపర్లు, ఛానల్స్ మద్దతు ఇవ్వలేదని అన్నారు. ఈ క్రమంలోనే శాసన మండలిలో ఆమె మాట్లాడుతూ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. 'మా ఇంటి దైవం లక్ష్మీ నర్సింహ స్వామి మీద ప్రమాణం చేసి చెబుతున్నాను.. నాది ఆస్తుల పంచాయతీ కాదు.. ఆత్మగౌరవ పంచాయతీనాది ఆస్తుల పంచాయతీ కాదు... ఆత్మగౌరవ పంచాయతీ' అని కవిత పేర్కొన్నారు.

# టీజీ జనసేన కమిటీలు రద్దు




మొదటి పేజీ తరువాయి

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలోని జనసేన కమిటీలన్నిటినీ రద్దు చేస్తున్నట్టు పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి అధికారికంగా ప్రకటించారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ, వీరమహిళ, యువజన, విద్యార్థి విభాగాలకు చెందిన కమిటీలను పూర్తిగా తీసేసి, వాటి స్థానంలో తాత్కాలిక అడ్‌హాక్ కమిటీలను నియమించారు. ఈ అడ్‌హాక్ కమిటీలు మొత్తం 30 రోజుల పాటు పనిచేస్తాయి. ఈ కమిటీ సభ్యులు రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గం, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 300 వార్డులకు వెళ్లి విస్తృతంగా పర్యటిస్తారు. అక్కడ చురుకైన కార్యకర్తలను గుర్తించి, ప్రతి వార్డు నుంచి కనీసం ఐదుగురు సభ్యుల జాబితాను సిద్ధం చేసి పార్టీ కార్యాలయానికి సమర్పిస్తారు. ఈ నివేదికల ఆధారంగా త్వరలోనే కొత్త శాశ్వత కమిటీలను ప్రకటించి, పార్టీని సంస్థాగతంగా మరింత పటిష్ఠం చేయనున్నారు. ఈ పునర్వ్యవస్థీకరణతో తెలంగాణలో జనసేనకు కొత్త జోష్ వచ్చి, క్షేత్రస్థాయిలో బలమైన నాయకత్వం ఏర్పడుతుందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. పవన్ నాయకత్వంలో పార్టీ మరింత చురుగ్గా ముందుకు సాగుతుందని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.



# కూర్చొని మాట్లాడుకోరాదా?

మొదటి పేజీ తరువాయి

విషయాలపై నివేదిక ఇవ్వాలని కోరింది. ఈ క్రమంలోనే సివిల్ సూట్‌లో జోక్యం చేసుకుని నిలుపుదల చేసే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా? అని సీజేఐ ప్రశ్నించారు. ఈ సందర్భంగా తమకు మధ్యంతర ఉపశమనం కల్పించాలని సింఘ్వీ కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వరద జలాలే వాడుకుంటామని చెబుతోందని సింఘ్వీ అన్నారు. కేటాయింపులకు విరుద్ధంగా నీటి వినియోగం సాధ్యపడదని, ఇందుకు సంబంధించి అనేక విషయాలు ముడిపడి ఉంటాయని పేర్కొన్నారు. విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన రాష్ట్రం తెలంగాణ అని, అక్కడ ప్రాజెక్టులు అన్నీ ఇప్పుడు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. పిటిషన్ దాఖలు తర్వాత కేంద్రం కమిటీని నియమించిందని సింఘ్వీ వాదనలు వినిపించారు. ఏపీ కేవలం ప్రాజెక్టు నివేదిక కోసమే టెండర్లు పిలవాలని చూస్తోందని సీజేఐ అన్నారు. జాతీయ ప్రాజెక్టుల విషయంలో కేంద్రానికి న్యాయ పరిధి ఉంటుందన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా ఎందుకు పరిష్కరించకోకూడదని సీజేఐ సూచించారు. సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ఆంధ్రప్రదేశ్ తరఫున వాదనలు వినిపించారు. ఈ క్రమంలో ముకుల్‌మాట్లాడుతూ భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టు నివేదికపై అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. నా ఇల్లు – నేను కట్టుకోవాలనుకుంటే మీకు అభ్యంతరం ఏంటి అని అడిగారు. నా భూభాగంలో చేపట్టే ప్రాజెక్టు నివేదిక తయారు చేసుకుంటే అభ్యంతరం ఎందుకో? సీమలో కరవు ప్రాంతానికి నీటిని తీసుకెళ్లడానికే ప్రాజెక్టు ప్రతిపాదన. ఎక్కడా ఏ ఉత్తర్వులు, తీర్పులు ఉల్లంఘనలు ఈ ప్రాజెక్టులో లేవు అని రోహత్గి వాదించారు. పరివాహక ప్రాంత రాష్ట్రాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని ఈ సందర్భంగా సీజేఐ సూచించారు. అయితే, ఈ ప్రాజెక్టు వల్ల ఏ ఒక్క రాష్ట్రానికి నష్టం జరగదని ముకుల్ రోహత్గి ఎవాదించారు. తెలంగాణ మాత్రం గోదావరిపై వందల ప్రాజెక్టుల నిర్మిస్తోందని ఏపీ తరఫున మరొక న్యాయవాది జగదీప్ గుప్తా వాదనలు వినిపించారు. ఇరు వాదనలు విన్న సుప్రీంకోర్టు తదుపరి విచారణను ఈ నెల 12కు వాయిదా వేసింది. అందరి అభిప్రాయాలతోనే తదుపరి విచారణ కొనసాగిస్తామని సీజేఐ వెల్లడించారు.

# హరీశ్‌కు రిలీఫ్

మొదటి పేజీ తరువాయి

వేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. గతంలో ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. అనంతరం పిటిషన్లను కొట్టివేస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

# బాలికలకూ మహిళా సంఘాలు



సమాధానం చెప్పారు. ప్రతి మహిళ స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉండాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పం మంత్రి సీతక్క చెప్పారు. అందుకోసమే రాష్ట్రంలో 15 సంవత్సరాలు దాటిన బాలికల, వృద్ధుల వరకూ మహిళా సంఘాల్లో సభ్యులుగా చేర్చుతున్నామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగకు పంపిణీ చేయాల్సి ఉచిత చీరలు ఎందుకు ఆలస్యమయ్యాయో తెలిపారు మంత్రి సీతక్క. రాష్ట్రంలోని మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు ఇవ్వాలని భావించామని చెప్పిన మంత్రి.. ఉత్పత్తి ఆలస్యం కారణంగా పట్టణ ప్రాంతాల్లో పంపిణీ ఆగిపోయిందన్నారు. మహిళా సంఘాలు ముందుకు వస్తే.. ఆసుపత్రులు కాలేజీలు, ఆలయాలు వంటి రద్దీ ప్రాంతాల్లో.. క్యాంటీన్, పాల బూత్, కిరాణ షాపులు వంటి ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం తరఫున మద్దతు ఇస్తామని మంత్రి సీతక్క చెప్పారు. కాగా, యాదగిరిగుట్ట వద్ద స్వయం సహాయక సంఘాల చేత క్యాంటీన్‌తో పాటు.. ఇతర దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ నుంచి ప్రతిపాదనలు తీసుకుంటామని చెప్పారు. మహిళల సాధికారత కోసం ప్రభుత్వం ఈ మేరకు వినూత్న కార్యక్రమాలు చేపడుతోందని.. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని మహిళలు.. మహిళా సంఘాల్లో చేరాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# తొలి ఆర్ఏఎస్ ట్రౌట్ ఫాం ప్రారంభం

## దేశంలోనే మొట్టమొదటిది

**ప్రారంభించిన కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్**

మత్స్య రంగ ఆవిష్కరణకు మద్దతు అని వెల్లడి

హైదరాబాద్, జనవరి 5 (పీఐబీ): స్మార్ట్‌గ్రీన్ ఆక్వాకల్చర్‌కు చెందిన తొలి సమీకృత రీసర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టం(ఆర్ఏఎస్) ట్రౌట్ ఫాంను కేంద్ర కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సోమవారం ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లాలో నెలకొల్పిన ఈ ఫాం దేశంలోనే మొదటిది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... ఈ ప్రాజెక్టును మత్స్య రంగంలో కీలక ముందడుగుగా అభివర్ణించారు. ఇది ఊహలకు అందనిది అని పేర్కొన్న కేంద్ర మంత్రి.. ఆక్వాకల్చర్‌లో సాంకేతికత పరివర్తనా శక్తిని ఇది ప్రదర్శిస్తుందని వ్యాఖ్యానించారు.



ఈ కార్యక్రమ ప్రాముఖ్యాన్ని ప్రస్తావిస్తూ... హైదరాబాద్‌లో చల్లని నీటి జాతి ట్రౌట్ చేపలను విజయవంతంగా సాగు చేయడంలో సరైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబిస్తే దేశంలో ఎక్కడైనా, ఏదైనా జాతి చేపలనైనా ఉత్పత్తి చేయవచ్చని ఇది రుజువు చేస్తుందని రాజీవ్ రంజన్ సింగ్ తెలిపారు. ఉష్ణోగ్రత నియంత్రిత ఆక్వాకల్చర్ వ్యవస్థలు సాంప్రదాయ భౌగోళిక, వాతావరణ పరిమితులను అధిగమించగలవనీ, దేశవ్యాప్తంగా మత్స్యరంగ అభివృద్ధికి కొత్త అవకాశాలను ఇవి అందుబాటులోకి తెస్తాయని ఆయన స్పష్టం చేశారు. మత్స్య రంగంలో ఆవిష్కరణలకు భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి పునరుద్ఘాటించారు. మంత్రిత్వ శాఖ ఇటువంటి కార్యక్రమాలకు నిరంతరం మద్దతునిస్తూనే ఉందనీ... వివిధ పథకాలు, నిధుల విధానాల ద్వారా వాటికి సహాయం అందిస్తూనే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆర్ఏఎస్, ఇతర అధునాతన ఆక్వాకల్చర్ సాంకేతికతల ప్రోత్సాహానికి పూర్తి స్థాయిలో మద్దతునిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కొత్త విధానాలను అందిపుచ్చుకుంటున్న పారిశ్రామికవేత్తలు మత్స్య, వ్యవసాయ రంగాల బలోపేతంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి... కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి ఎస్. పి. సింగ్ బఘేల్, మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్, తెలంగాణ ప్రభుత్వ పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తదితరులు హాజరయ్యారు.

## బీఆర్ఎస్ నేతలు తోకముడిచారు



హైదరాబాద్, జనవరి 5 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ శాసనసభ్యులు తోక ముడిచారని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని చెప్పిన ప్రతిపక్షం అసెంబ్లీ నుంచి జారుకుందని ఆయన ఎద్దేవా చేశారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బీరాలు పలికారని అన్నారు. సభాపతిని అవమానపరిచేలా వారు వ్యవహరించినందుకు వారిపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. బీఏసీ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు యక్ష ప్రశ్నలు వేశారని అన్నారు. కానీ ఇప్పుడు మాత్రం సభలో కనిపించడం లేదని విమర్శించారు. శాసనసభలో ముఖ్యమైన అంశాలపై చర్చ జరిగే సమయంలో ప్రధాన ప్రతిపక్ష సభ్యులు గైర్హాజరు కావడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకే ప్రభుత్వం కృష్ణా జలాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేసిందని వెల్లడించారు. ప్రతిపక్షానికి అభ్యంతరాలు ఉంటే సభలో చెప్పాలి కానీ బయట మాట్లాడటమేమిటని ఆయన ప్రశ్నించారు.

## క్రూయిజ్ ట్రిప్ పేరుతో 2.42 లక్షల కుచ్చుటోపీ

కాచిగూడ/హైదరాబాద్, జనవరి 5 (ఈవార్తలు): క్రూయిజ్ ట్రిప్ పేరుతో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తికి సైబర్ నేరగాళ్లు రూ. 2.42 లక్షలు కుచ్చుటోపీ పెట్టారు. పలు దఫాల్లో లక్షల రూపాయలు చెల్లించిన బాధితుడు, చివరకు తాను మోసపోయానని గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాచిగూడకు చెందిన ఒక వ్యక్తి గూగుల్ సెర్చ్‌లో కనిపించిన వెబ్‌సైట్ ద్వారా డిసెంబర్ 26న కొచ్చి–లక్షద్వీప్–ముంబై క్రూయిజ్ ట్రిప్ బుక్ చేసుకున్నాడు. నాలుగు టికెట్లు తీసుకున్న అతను ముందస్తు అడ్వాన్సుగా రూ. 23,680 చెల్లించాడు. ఒకేసారి అంతమొత్తం ట్రాన్స్ ఫర్ అవకపోవడంతో పలు దఫాల్లో చెల్లింపులు జరపాలని అవతలి వ్యక్తి సూచించాడు. లక్షద్వీప్ పర్మిట్ ఛార్జీలు, పిల్లల ఛార్జీలు, సాంకేతిక కారణాలు ఇలా పలు కారణాలు చెప్పి పలుమార్లు అవతలి వ్యక్తి పేమెంట్ చేయించాడు. బుకింగ్ క్యాన్సిల్ కింద కూడా రూ. 48,500 కట్టాలని డిమాండ్ చేశాడు. మొత్తం రూ. 2.42 లక్షలు బాధితుడు చెల్లించాడు. అదనంగా కట్టిన మొత్తాన్ని రిఫండ్ చేస్తామని అవతలి వ్యక్తి నమ్మించే ప్రయత్నం చేశాడు. కానీ అనుమానం వచ్చిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సదరు కంపెనీ కస్టమర్ కేర్ ప్రతినిధిగా ఒక వ్యక్తి వాట్సాప్ ద్వారా తనను సంప్రదించినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో సైబర్ క్రైమ్స్ డిప్యూటీ కమిషనర్ ఒక అడ్వైజరీని జారీ చేశారు. పర్యాటక ప్యాకేజీలను అధికారిక వెబ్‌సైట్ లేదా ఆథరైజ్డ్ ఏజెంట్ల ద్వారానే బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. గూగుల్ సెర్చ్ లేదా అడ్వర్టైజ్‌మెంట్లలో కనిపించే సైట్లను నమ్మి పేమెంట్లు చేయవద్దని సూచించారు. సాంకేతిక సమస్యలు, పేమెంట్ ఫెయిల్యూర్ పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తే అనుమానించాల్సిన విషయమేనని పేర్కొన్నారు. అధికారిక వెబ్‌సైట్‌లలో ఉండే కస్టమర్ కేర్ నెంబర్లనే విశ్వసించాలని సూచించారు. వాట్సాప్‌లో సంప్రదించే వారిని విశ్వసించవద్దని తెలిపారు.

## పైరసీపై సైబర్ బ్యూరో, ఫిలిం చాంబర్ జత

హైదరాబాద్, జనవరి 5 (ఈవార్తలు): తెలుగు సినిమా పరిశ్రమను పట్టి పీడిస్తున్న డిజిటల్ పైరసీపై ఉమ్మడి పోరుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ), తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) నడుం బిగించాయి. సినిమా పైరసీని సాంకేతిక పరిజ్ఞానంతో సమర్థంగా అరికట్టేందుకు ఇరు సంస్థలు సోమవారం ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం ద్వారా పైరసీ నెట్‌వర్క్‌లపై వ్యవస్థీకృత చర్యలు చేపట్టనున్నారు. ఈ ఒప్పందంపై టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయెల్, టీఎఫ్‌సీసీ అధ్యక్షుడు దగ్గుబాటి సురేష్ బాబు సంతకాలు చేశారు. తెలంగాణ డీజీపీ బి. శివధర్ రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ ఎంఓయూ ప్రకారం, పైరసీపై రియల్ టైమ్ నిఘా, సమాచార మార్పిడి కోసం ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తారు. టీఎఫ్‌సీసీకి చెందిన యాంటీ–పైరసీ ఏజెంట్లను టీజీసీఎస్‌బీ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో (ఐసీసీసీ) నియమించి, సైబర్ క్రైమ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పైరసీ కంటెంట్‌ను వేగంగా తొలగించేలా చర్యలు తీసుకుంటారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ, డిజిటల్ పైరసీ ఒక వ్యవస్థీకృత సైబర్ నేరంగా మారిందని, దీనిని ఎదుర్కోవడానికి పరిశ్రమ, చట్ట అమలు సంస్థలు కలిసి పనిచేయడం కీలకమని అన్నారు.

# హౌజింగ్ బోర్డు ఫ్లాట్లకు భలే డిమాండ్

**గచ్చిబౌలిలో లోని 111 ఫ్లాట్లకు 2685 దరఖాస్తులు**

**నేడు లాటరీ పద్ధతిలో ఫ్లాట్ల కేటాయింపు**

హైదరాబాద్ , జనవరి 5 (ఈవార్తలు): అల్పాదాయ (ఎల్ ఐ జి ) వర్గాల కోసం హౌసింగ్ బోర్డు ప్రత్యేకంగా కేటాయించిన వివిధ ప్రాంతాల్లోని ఫ్లాట్ల కొనుగోలుకు ప్రజల నుంచి భారీ స్పందన వచ్చింది. హైదరాబాద్ , వరంగల్, ఖమ్మం ప్రాంతాల్లో ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించిన ఫ్లాట్లను ఎల్ ఐ జి వర్గాలకు (6 లక్షల వార్షికాదాయం ఉన్న ప్రజల కోసం) విక్రయించడానికి, ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ హౌసింగ్ బోర్డు డిసెంబ ర్ 16 వ తేదీననోటిఫికేషన్ ఇచ్చింది. 3 వ తేదీ సాయంత్రం వరకు మొత్తం 3.096 దరఖాస్తులు వచ్చాయి. ఒక్క హైదరాబాద్ గచ్చిబౌలి ప్రాంతంలోని వివిధ అపార్ట్ మెంట్ లలో ఉన్న 111 ఫ్లాట్ల కోసం 2685 దరఖాస్తులు వచ్చాయి. వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రాజెక్టులోని ఫ్లాట్ల కూడా 388 దరఖాస్తులు వచ్చాయి. కాగా ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఖమ్మం లోని ఫ్లాట్లకు దరఖాస్తుల స్వీకరణ తేదీని 8 వ తేదీ వరకు పొడిగించారు. వీటికి సంబంధించిన లాటరీ ప్రక్రయను పూర్తి పాదర్శకంగా నిర్వహించడానికి హౌసింగ్ బోర్డు అన్ని ఏర్పాట్లు చేసింది. 6 వ తేదీన హైదరాబాద్, 8 వ తేదీన వరంగల్ , 10 వ తేదీన ఖమ్మం ప్రాంతంలోని ఫ్లాట్ల కేటాయింపునకు సంబంధించిన లాటరీ ప్రక్రియ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని హౌసింగ్ బోర్డు ప్రజా సంబంధాల అధికారి వీ వాసు ఒక ప్రకటనలో తెలిపారు.



**కేంద్రంలోకి ప్రజలకు నో ఎంట్రీ**

హైదరాబాద్ గచ్చిబౌలి ప్రాంతంలోని ఫ్లాట్ల కేటాయింపు ప్రక్రియకు సంబంధించిన లాటరీని నిర్మిత కేంద్ర వద్ద ముందుగా ప్రకటించినట్లుగానే జనవరి 6 వ తేదీన మంగళవారం నాడు ఉదయం , మధ్యాహ్నం రెండు విడతల్లో నిర్వహించున్నారు. ఉదయం పూట రాంకీ ప్రాజ క్టులోని 76 ఫ్లాట్లకు, మధ్యాహ్నం వసంత ప్రాజెక్టు లోని 35 ఫ్లాట్లకు ఈ లాటరీ నిర్వహిస్తున్నట్లు వాసు తెలిపారు. ఈ ఫ్లాట్ల కొనుగోలుకు భారీగా దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో, దరఖాస్తు దారులు, లాటరీ ప్రక్రియ చూడటానికి రావద్దనీ, ఈ ప్రక్రయ మొత్తం ఆన్ లైన్ లోనూ, యూట్యూబ్ తదితర మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్లుగా వెల్లడించారు. అనూహ్యంగా, ఒక్కో ఫ్లాట్ కు సగటున 25 మంది వరకు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో, ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి లాటరీ నిర్వహించే ప్రాంగణంలోని స్థలాభావం,భద్రతా కారణాల రీత్యా లాటరీ ప్రక్రియ కు ప్రజలను అనుమతించబోవడం లేదన్నారు. అధికారుల సమక్షంలో పూర్తి పారదర్శకంగా నిర్వహించే లాటరీ ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారం చేయడం తోపాటు, ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో రికార్డు కూడా చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అంతే కాకుండా నిర్మిత కేంద్ర ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్క్రీన్ల ద్వారా లాటరీ నిర్వహణ ను చూడవచ్చుని వివరించారు. దరఖాస్తులు దారులు లాటరీ ప్రక్రియను https://www. youtube.com/ live/gCBIRWz8qt0 యూట్యూబ్ లింక్ ద్వారాను ఇతరత్రా మాద్యమాల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూడవచ్చుని , ఈలాటరీ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు దరఖాస్తు దారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణలో ఉన్న నక్సల్స్ 17 మందే

హైదరాబాద్, జనవరి 5 (ఈవార్తలు): రాష్ట్రానికి చెందిన మరో 17 మంది మావోయిస్టులు లొంగిపోతే తెలంగాణ మావోయిస్టు రహిత రాష్ట్రంగా నిలుస్తుందని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన వారు 17 మంది మాత్రమే ఉన్నారని ఆయన వెల్లడించారు. వారిలో కేంద్ర కమిటీలో నలుగురు, రాష్ట్ర కమిటీలో ఐదుగురు, డివిజన్ కమిటీలో ఆరుగురు, అండర్ గ్రౌండ్‌లో ఇద్దరు ఉన్నారని తెలిపారు. వారిలో ఐదుగురు మహిళలు ఉన్నారని ఆయన అన్నారు. ఈ 17 మంది మావోయిస్టులపై మొత్తం రూ. 2.25 కోట్ల రివార్డు ఉందని ఆయన చెప్పారు. వారంతా లొంగిపోవాలని డీజీపీ శివధర్ రెడ్డి సూచించారు. ఆపరేషన్ కగార్ గడువు లోపే తెలంగాణ మావోయిస్టు రహిత రాష్ట్రంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలిస్తే పోలీసు శాఖ నుంచి వారికి అవసరమైన సహాయం అందుతుందని ఆయన అన్నారు.

## భారత జాగృతిగా ఎందుకు మార్చావ్?

**కవితను ప్రశ్నించిన గొంగిడి సునీత**

హైదరాబాద్, జనవరి 5 (ఈవార్తలు): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన తర్వాత, ఇప్పుడు శాసనమండలికి వెళ్లి కంటతడి పెడుతున్నారని బీఆర్ఎస్ నాయకురాలు గొంగిడి సునీత విమర్శించారు. మద్యం కుంభకోణంలో కవిత జైలుకు వెళ్ళినప్పుడు ఆమెను విడిపించడానికి హరీశ్ రావు ఎంతో కృషి చేశారని ఆమె అన్నారు. కవిత కూర్చున్న కొమ్మను నరుక్కునే ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. కవిత ఎవరో చెప్పినట్లు ఆడుతున్నారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మహిళా నేతలతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. నిజామాబాద్‌లో ఎంపీ స్థానం నుంచి ఓడిపోతే కవిత బాధను చూడలేక కేసీఆర్ ఎమ్మెల్సీ పదవిని ఇచ్చారని అన్నారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చడం ఇష్టం లేదన్న కవిత, తెలంగాణ జాగృతిని భారత జాగృతిగా ఎందుకు మార్చారో చెప్పాలని నిలదీశారు. పార్టీలో ప్రాధాన్యం లేకుండానే రెండుసార్లు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారా అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారులను పార్టీ విస్మరించిందనేది అవాస్తవమని అన్నారు. అమరులను స్మరించుకోవడానికే అమరుల జ్యోతిని నిర్మించినట్లు తెలిపారు. కేసీఆర్‌ను విమర్శిస్తూ కవిత తన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆమె అన్నారు.

## కేఏ పాల్ కూడా పార్టీ పెట్టారు

**కవిత పార్టీ ప్రకటనపై రాంచందర్ రావు ఎద్దేవా**

హైదరాబాద్, జనవరి 5 (ఈవార్తలు): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్త పార్టీ ఏర్పాటు చేస్తానన్న ప్రకటనపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. ఎవరైనా పార్టీలు పెట్టుకోవచ్చని, కేఏ పాల్ కూడా ఒక పార్టీ స్థాపించారని ఆయన గుర్తు చేశారు. ఆత్మగౌరవం దెబ్బతిన్నదని కవిత చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, అది వారి కుటుంబానికి సంబంధించిన విషయమని అన్నారు. ఆమె పార్టీ పెట్టడం వల్ల తమకు ఎలాంటి నష్టం లేదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని రామచందర్ రావు ఖండించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఎవరికీ ఒరిగిందేమీ లేదని ఆయన అన్నారు. పలు రాష్ట్రాల్లో ఉపాధి హామీ పథకంలో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆయన ఆరోపించారు. పారదర్శకత లేని పథకాలే కాంగ్రెస్ పార్టీకి కావాలని ఆయన విమర్శించారు.

## నల్లమలసాగర్ లింకును ఒప్పుకోం

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ**

**ట్రైబ్యునల్ అవార్డుకు విరుద్ధమని స్పష్టీకరణ**

హైదరాబాద్, జనవరి 5 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టాలని భావిస్తున్న పోలవరం–నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కరాఖండిగా చెప్పారు. ఈ ప్రాజెక్టును కచ్చితంగా అడ్డుకుని తీరుతామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలు గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్–1980 అవార్డుకు, అంతర్రాష్ట్ర జల నిబంధనలకు స్పష్టంగా విరుద్ధమని అన్నారు. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు చూపిస్తున్న లేఖ, కేవలం సమాచారం కోసం కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) పంపిన అంతర్గత లేఖ మాత్రమేనని, దానికి ఆమోదం తెలిపినట్టు కాదని తోసిపుచ్చారు. తెలంగాణ ప్రయోజనాలపై ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ఇప్పటికే గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ), పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ, సీడబ్ల్యూసీ, కేంద్ర జలశక్తి శాఖలకు లేఖలు రాశామని, ఈ సంస్థలన్నీ తెలంగాణ వాదనతో ఏకీభవించాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తున్నామని, తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణకు సీనియర్



న్యాయవాది అభిషేక్ సింఘ్వీని నియమించామని ఉత్తమ్ వెల్లడించారు. నేడు జరగాల్సిన వాదనలు వచ్చే సోమవారానికి వాయిదా పడ్డాయని, రిట్ పిటిషన్‌ను సూట్ పిటిషన్‌గా మార్చి దాఖలు చేయాలని కోర్టు నుంచి సూచన అందిందని తెలిపారు. వచ్చే వాయిదాకు తానే స్వయంగా హాజరై స్టే ఆర్డర్ కోరతామని చెప్పారు. తెలంగాణ మాత్రమే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు కూడా ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను నిలిపివేయించడంలో సఫలమైందని మంత్రి ఉత్తమ్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ఆ ప్రాజెక్టు ఆగిపోయిందన్నారు. పదేళ్ల పాలనలో జలవనరుల నిర్వహణలో బీఆర్ఎస్ ఘోరంగా విఫలమైందని ఆయన ఆరోపించారు.

## సీఎం రేవంత్‌పై చర్యలు తీసుకోండి

**అసెంబ్లీ సెక్రటరీకి బీఆర్ఎస్ ఫిర్యాదు**

హైదరాబాద్, జనవరి 5 (ఈవార్తలు): బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సోమవారం రోజున అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతిని కలిశారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఫిర్యాదు చేశారు. రేవంత్ రెడ్డిపై అధికార ఉల్లంఘన, సభ ధిక్కారానికి సంబంధించి హక్కుల తీర్మానాన్ని సమర్పించారు. శాసనసభలో కృష్ణా జలాలపై జరిగిన చర్చ సందర్భంగా తప్పుడు సమాచారం ఇచ్చి సభను తప్పుదోవ పట్టించిన సీఎం రేవంత్ రెడ్డిపై చర్యలు చేపట్టాలని కోరారు. అసెంబ్లీ సెక్రటరీని కలిసిన వారిలో బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, విజయుడు, అనిల్ జాదవ్ ఉన్నారు.

శాసనసభలో శనివారం రోజున కృష్ణా జలాలపై జరిగిన చర్చ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీని తప్పుదోవ పట్టించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఏపీ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం నిలిపివేతపై తప్పుడు ప్రకటనలు చేశారని, సాగునీటి విషయాలపై జరిగిన రెండు అపెక్స్ కౌన్సిల్ సమావేశాల మినిట్స్‌ను వక్రీకరించారని.. అలాగే తెలంగాణ, ఏపీ మధ్య తాత్కాలిక కృష్ణా జలాల పంపిణీ ఒప్పందాన్ని ఒక కట్టుబడి ఉండే ఒప్పందంగా చిత్రీకరించారని ఆరోపిస్తూ సీఎం రేవంత్ రెడ్డిపై ఈ తీర్మానం సమర్పించారు.

## వైద్యశాఖలో 850 పోస్టుల భర్తీ

హైదరాబాద్, జనవరి 5 (ఈవార్తలు): తెలంగాణలోని నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ ఆసుపత్రులను సమూలంగా బలోపేతం చేస్తున్నట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు. రాష్ట్రంలో అత్యున్నత వైద్య సేవలందించే నిమ్స్ ఆసుపత్రిపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి చెప్పారు. నిమ్స్‌లో అదనంగా 125 వెంటిలేటర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఖాళీగా ఉన్న 850 ఉద్యోగాలను త్వరలోనే భర్తీ చేస్తామని సభకు హామీ ఇచ్చారు. శాసనసభ వేదికగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి అనుగుణంగా అత్యాధునిక వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,790 వెంటిలేటర్ బెడ్లకు అదనంగా మరో 490 వెంటిలేటర్లను కొనుగోలు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. వీటిని గాంధీ, ఉస్మానియా, ఎంజీఎంతో పాటు జిల్లా ఆసుపత్రుల్లో ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే, రోగ నిర్ధారణలో కీలకమైన 9 కొత్త ఎంఆర్ఐ యంత్రాలను వివిధ ప్రభుత్వ ఆసుపత్రులకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల పేదలకు ఖరీదైన పరీక్షలు ఉచితంగా అందుబాటులోకి వస్తాయని వివరించారు. అత్యవసర సేవలపైనా ప్రభుత్వం దృష్టి సారించిందని, కొత్త అంబులెన్స్‌ల రాకతో రెస్పాన్స్ సమయం 18 నిమిషాల నుంచి 13 నిమిషాలకు తగ్గిందని మంత్రి తెలిపారు. ఈ ఏడాది మరో 79 అంబులెన్స్‌లను ప్రవేశపెట్టి ఈ సమయాన్ని 10 నిమిషాలకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. డయాలసిస్ రోగుల కోసం ప్రతి 25 కిలోమీటర్లకు ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇకపై బస్తీ దవాఖానాల్లో మందుల కొరత లేకుండా నేరుగా సెంట్రల్ స్టోర్స్ నుంచి సరఫరా చేసేలా కొత్త విధానం తెస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.

## పంపకాల్లో తేడాతోనే కవిత బయటికి

హైదరాబాద్, జనవరి 5 (ఈవార్తలు): ఆస్తి పంపకాల్లో తేడాతోనే బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బయటికి వెళ్లినట్టు తెలంగాణ బీజేపీ చీఫ్ రామచంద్రరావు అన్నారు. శాసన మండలిలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భావోద్వేగ ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి బీజేపీ తీవ్ర ద్రోహం చేసిందని ఆరోపించారు. అలాగే అన్యాయంగా తనపై లిక్కర్ స్కామ్‌లో జైలుకు పంపినట్టు ఆమె ఆరోపించారు. ఈ నేపథ్యంలో కవితపై ఆ పార్టీ తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు మండిపడ్డారు. కవిత కొత్త పార్టీ పెట్టడంపై ఆయన దెప్పి పొడిచారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చన్నారు. అయితే కవిత పెట్టే పార్టీ వల్ల తెలంగాణ రాజకీయాల్లో వచ్చే మార్పేమీ లేదని ఆయన కొట్టి పారేశారు. అలాగే బీఆర్ఎస్ హయాంలో అవినీతి జరిగిందని కవిత తీవ్ర ఆరోపణలపై మాత్రం ఆయన సానుకూలంగా స్పందించారు.

# 18న మేడారానికి సీఎం రేవంత్



**సీఎం చేతుల మీదుగా గద్దెల పునరుద్ధరణ**

హైదరాబాద్, జనవరి 5 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 18న మేడారం వెళ్లనున్నారు. జనవరి 28 నుంచి 31 వరకు జరిగే మహా జాతరకు ప్రభుత్వం ఘనంగా ఏర్పాట్లు చేస్తోంది. అమ్మవార్ల గద్దెల పునరుద్ధరణతో పాటు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. వేలాది మంది భక్తులు నిలువెత్తు బంగారంతో మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ నెల 19న మేడారం గద్దెల పునరుద్ధరణ జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పునరుద్ధరణ కార్యక్రమం ఉంటుంది. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సహా మంత్రులు హాజరు కానున్నారు.

## సిద్దిపేట మెడికల్ కాలేజీలో జూడా ఆత్మహత్య

సిద్దిపేట, జనవరి 5 (ఈవార్తలు): సిద్దిపేటలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. స్థానిక మెడికల్ కాలేజీలో ఓ యువ వైద్యురాలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. హాస్టల్ గదిలో పారాక్వాట్ గడ్డి మందు (పంట చేలలో కలుపు నివారణకు వినియోగించే విషపూరిత మందు) ఇంజక్షన్ తీసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లగా, హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి కన్నుమూశారు. వివరాల్లోకి వెళితే.. జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన లావణ్య (2020 బ్యాచ్) సిద్దిపేట మెడికల్ కాలేజీలో హౌస్ సర్జన్ పూర్తి చేసి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇంటర్న్‌షిప్ చేస్తున్నారు. శనివారం ఉదయం ఆమె తన హాస్టల్ గదిలోనే గడ్డి మందును ఇంజక్షన్ ద్వారా తీసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ విషయాన్ని గమనించిన తోటి విద్యార్థులు వెంటనే ఆమెను సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు.



## కలెక్టర్ కొండగట్టు గిరి ప్రదక్షిణ రోడ్డు పరిశీలన

మల్యాల, జనవరి 5 (ఈవార్తలు): కొండగట్టు గిరి ప్రదక్షిణ రహదారి అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ గిరిప్రదక్షిణ రహదారిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొండగట్టు ఆలయం చుట్టూ భక్తులు గిరి ప్రదర్శన చేయడానికి కావాల్సిన ఏర్పాట్ల గురించి రెవెన్యూ, ఫారెస్ట్, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖ సంబంధిత అధికారులతో కలిసి ముందుకు సాగుతున్నామన్నారు. అరుణాచలం, సింహాచలం తరహాలో గిరిప్రదక్షిణ ఏర్పాట్లకు ప్రణాళికలు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. గిరిప్రదక్షిణ రహదారి మొత్తం పొడవు 6 కిలోమీటర్లు కాగా, ఇందులో 3 కిలోమీటర్లు ఘాట్ రోడ్, మిగతా మార్గం మట్టి రోడ్డు ఉంది. ఈ మార్గంలో 50 ఫీట్ల వెడల్పుతో రహదారి నిర్మాణానికి ప్రణాళిక రచించనున్నారు. 30 ఫీట్ల రోడ్డు, 20 ఫీట్ల ఫుట్‌పాత్ నిర్మాణంపై అధ్యయనం చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం లైటింగ్, పార్కింగ్ సదుపాయాల కల్పన చేపట్టనున్నారు. 1150 మీటర్ల రహదారి ఫారెస్ట్ పరిధిలోకి వస్తుందని గుర్తించగా, గిరిప్రదక్షిణకు ఫారెస్ట్ శాఖ పూర్తి సహకారం ఇస్తుందని డీఎఫ్ఓ స్పష్టం చేశారు. ఫారెస్ట్ భూమికి బదులుగా ఎండోమెంట్ భూమి ఇచ్చే ప్రతిపాదన ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బీ రాజా గౌడ్, అటవీ శాఖ అధికారి రవిప్రసాద్, ఆర్డీవో మధుసూదన్, ఈవో శ్రీకాంతారావు, ముత్యంపేట సర్పంచ్ ఆదిరెడ్డి, మల్యాల, కొడిమ్యాల మండల అధికారులు పాల్గొన్నారు.

## ఏపీ గోల్డెన్ అథ్లెట్ జ్యోతి యర్రాజికి సత్కారం

**రూ. 30.35 లక్షల ఆర్థిక సాయం: లోకేశ్**



అమరావతి, జనవరి 5 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ అథ్లెట్ జ్యోతి యర్రాజిని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ అభినందించారు. ఏషియన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 100 మీటర్ల హర్డిల్స్‌లో సరికొత్త మీట్ రికార్డుతో స్వర్ణ పతకం సాధించిన జ్యోతిని ఆయన ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా జ్యోతి యర్రాజికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ. 30.35 లక్షల ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. జ్యోతి యర్రాజీతో భేటీ అయిన అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "ఆంధ్రప్రదేశ్ గర్వకారణమైన జ్యోతి యర్రాజిని కలవడం చాలా సంతోషంగా ఉంది. ఆమె పట్టుదల, కృషి దేశానికే స్ఫూర్తిదాయకం" అని కొనియాడారు. ఏషియన్, కామన్వెల్త్ గేమ్స్‌కు సిద్ధమయ్యేందుకు ఈ ఆర్థిక సహాయం అందించామని వివరించారు. భవిష్యత్తులో జ్యోతి యర్రాజి ఒలింపిక్స్‌లో పతకం సాధించేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. ఒలింపిక్స్‌లో విజయం సాధించాలనే ఆమె ప్రయాణంలో ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

## సీమకు కూటమి సర్కారు అన్యాయం

**తెలంగాణ అసెంబ్లీ వేదికగా బట్టబయలు**

**వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి వెల్లడి**



కర్నూలు, జనవరి 5 (ఈవార్తలు): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మరోసారి విమర్శలు గుప్పించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం ఆగిపోవడానికి కారణం చంద్రబాబే అని ఆయన అన్నారు. సీమకు కూటమి ప్రభుత్వం ఎంత అన్యాయం చేస్తోందో తెలంగాణ అసెంబ్లీ వేదికగా వెల్లడయిందని చెప్పారు. రాయలసీమను చంద్రబాబు తాకట్టు పెట్టారని భూమన మండిపడ్డారు. తెలంగాణ సీఎం రేవంత్ ప్రయోజనాల కోసం చంద్రబాబు సీమ ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాయలసీమ ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో రూ. 7 వేల కోట్లతో జగన్ పనులను ప్రారంభించారని తెలిపారు. రాయలసీమకు వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో చేశారని చెప్పారు. గాలేరు-నగరి, హంద్రీనీవా ప్రాజెక్టుల ద్వారా భూములను సస్యశ్యామలం చేశారని చెప్పారు. వైఎస్ వారసుడిగా జగన్ రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని కొనసాగించారని తెలిపారు. చంద్రబాబు రాయలసీమ వాసిగా ఉండి కూడా ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదని విమర్శించారు.



## పీఠం ప్రమోద్‌కు న్యూఇయర్ విషెస్

హైదరాబాద్, జనవరి 5 (ఈవార్తలు): తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల ఫోరం, తెలంగాణ వినియోగదారుల ఫోరం వ్యవస్థాపకుడు, రాష్ట్ర అధ్యక్షులు, శ్రమశక్తి అవార్డు గ్రహీత పీఠం ప్రమోద్ కుమార్‌కు పోగుల నవీన్ కుమార్ న్యూ ఇయర్ విషెస్ తెలిపారు. నవీన్‌తో పాటు ఏవీ ప్రమోద్ కుమార్, ప్రసాద్ చౌదరి, నాగరాజు చారి, నాగరాజు, యుగంధర్, శ్రీధర్, కాశీశ్వరరావు, ద్రోణాచారి, నగేష్, వినయ్, రామకృష్ణ, శ్రీనివాస్, క్రాంతి, నరేశ్ ఆయనను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా పీఠం ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ ఉద్యోగులు, వినియోగదారుల హక్కుల పరిరక్షణకు పోరాటం చేస్తున్న ఫోరం సభ్యులందర్నీ అభినందించారు. ప్రైవేట్ ఉద్యోగులకు పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ, లోకల్ ఎంప్లాయ్మెంట్ పాలసీ, ఉద్యోగ భద్రత పూర్తిగా అమలు అయ్యేవరకు, జూనియర్ కాలేజీలలో ఫీజ్ రెగ్యులేటరీ కమిటీ సూచనలు అమలు అయ్యేవరకు కృషి చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.



## కొండగట్టులో జీవన్ రెడ్డి ప్రత్యేక పూజలు

మల్యాల, జనవరి 5 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామం కొండగట్టు అంజన్న ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి మాజీ మంత్రి జీవన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం అర్చకులు, అధికారులు స్వామి వారి తీర్థ, ప్రసాదాలు అందజేసి, ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో ముత్యంపేట కొండగట్టు సర్పంచ్ దారం ఆదిరెడ్డి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత బస్సులు ఎవ్వరు అడిగారు?

**మాట్లాడితే తెలుగు బతుకుతుంది.. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు**



ఏటుకూరు, జనవరి 5 (ఈవార్తలు): తెలుగులో మాట్లాడితేనే భాషకు మనుగడ అని పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. పరిపాలన భాష తెలుగులోనే ఉండాలి... శుభలేఖలు తెలుగులోనే అచ్చు చేయించాలి అని వెంకయ్య నాయుడు సూచించారు. 'తెలుగు వారు తెలుగులోనే మాట్లాడుకోవాలి. పుష్ప గుచ్చాలు వద్దు పుస్తకం బహుమతిగా ఇవ్వండి. ఉచిత బస్సులు ఎవ్వరు అడిగారు?. ఉచిత విద్య వైద్యం ఇవ్వాలి. 'అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సూచించారు. మానవ సంబంధాల్లో వ్యక్తీకరణ భాష అని వీనుల విందైన సౌందర్యమైన తెలుగు భాష రామాయణ కాలం నుంచే ఉందని...తెలుగు వెలుగుకు అందరూ కృషి చేయాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కోరారు. ఏటుకూరులో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభల సమాపనోత్సవ సభ సోమవారం సాయంత్రం ఐదు గంటలకు జరిగింది. తెలుగు మాట్లాడకపోతే సంపూర్ణ మనుగడ ఉండదని, ప్రాణం వున్నా జీవం లేనట్లేనని ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. తెలుగు వాడు తెలుగు మాట్లాడితే తెలుగు బతుకుతుందని ఆయన స్పష్టం చేశారు. పాలనా భాష తెలుగులోనే ఉండాలని, పథకాలకు తెలుగు పేర్లు పెట్టాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సూచించారు. అందమైన తెలుగు భాష ఆత్మ సింధువులాంటిదని భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అభివర్ణించారు. మాతృ దేశాన్ని, మాతృ భూమిని, మాతృ భాషను ప్రేమించకుంటే బతికివున్నా చనిపోయినట్లే అని ఆయన అన్నారు. తెలుగు పాఠశాల వీధి బడిలో చదువుకునే తాను ఉప రాష్ట్రపతి అయ్యానని, మాతృ భాషలో చదివిన వారే అత్యున్నత స్థానాల్లో ఉన్నారని...అందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తాజా నిదర్శనమని వెంకయ్య నాయుడు వివరించారు. ఇంట్లో వీధిలో గుడిలో బడిలో అమ్మ భాష తెలుగులోనే మాట్లాడుకోవాలని...భాష పోతే శ్వాస పోయినట్లేనని భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చెప్పారు. భాష కోసం ఉద్యమించాల్సిన అవసరం లేదని ప్రతి ఒక్కరు తెలుగు లోనే మాట్లాడితే భాషాభివృద్ధి జరుగుతుందని భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. తెలుగు భాష పరిరక్షణ కోసం కవులు కళాకారులు కృషి చేయాలని...మాతృ భాషను గౌరవించాలని కోరారు. పరాయి భాషను ద్వేషించక్కర లేదని, ప్రభుత్వం ఉత్తర్వులు మాతృ భాషలోనే ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు.డా. గజల్ శ్రీనివాస్ అధ్యక్షత వహించిన ఈ సమాపనోత్సవ సభలో స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, ఎమ్మెల్యే రవి కుమార్, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, బాలకోటయ్య, బిజెపి అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్, నటుడు సాయి కుమార్, మా శర్మ, దవేజీ రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ వర్సిటీల ర్యాంకులపై గవర్నర్ గుర్రు

**పనితీరు మెరుగుపర్చాలని వీసీలకు సూచన**




అమరావతి, జనవరి 5 (ఈవార్తలు): జాతీయ స్థాయిలో విశ్వవిద్యాలయాల పనితీరును తెలిపే ఎన్ఐఆర్ఎఫ్ (ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్ వెనుకబడి ఉందని, ఈ పరిస్థితిని మెరుగుపరిచేందుకు వైస్ ఛాన్సలర్లు కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. 2025 ర్యాంకింగ్స్ ప్రకారం రాష్ట్రంలోని 25 ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో కేవలం ఆంధ్ర విశ్వవిద్యాలయం మాత్రమే టాప్-50లో, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం టాప్-100లో స్థానం సంపాదించాయని, ఇది ఆందోళన కలిగించే విషయమన్నారు. విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో పబ్లిక్ యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. ఈ సందర్భంగా గవర్నర్ నజీర్ మాట్లాడుతూ.. "మన విశ్వవిద్యాలయాలు విద్యా పరిపక్వతలో వివిధ దశల్లో ఉన్నాయి. ఈ ర్యాంకులు మన పనితీరును సమీక్షించుకుని, టాప్-100లో చోటు దక్కించుకోవడానికి ప్రయత్నించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి" అని అన్నారు. విద్యార్థులలో విమర్శనాత్మక ఆలోచన, నైతిక విలువలను పెంపొందించే వాతావరణాన్ని సృష్టించాలని, నాణ్యతను బయటి అవసరంగా కాకుండా సంస్థ అంతర్గత సంస్కృతిగా మార్చుకోవాలని సూచించారు. స్వామి వివేకానంద చెప్పినట్లుగా విద్య అంటే మెదడులో సమాచారం నింపడం కాదని, మనసును సరైన మార్గంలో తీర్చిదిద్దడమని గుర్తుచేశారు. పాఠాలను కంఠస్థం చేయించే పద్ధతికి స్వస్తి పలికి, విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించేలా బోధన ఉండాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్నత విద్య స్థూల ప్రవేశాల నిష్పత్తి (జీఈఆర్) 36.5గా ఉండి, జాతీయ సగటు (28.4) కన్నా మెరుగ్గా ఉండటం ప్రశంసనీయమని గవర్నర్ అన్నారు. అయితే, జాతీయ గణాంకాల నివేదిక ప్రకారం రాష్ట్ర అక్షరాస్యత శాతం జాతీయ సగటు కంటే తక్కువగా ఉందని, ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అక్షరాస్యతను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు, తొలి తరం అభ్యర్థుల అవసరాలపై విశ్వవిద్యాలయాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. "డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చెప్పినట్లుగా, విద్య అంతిమ లక్ష్యం నైపుణ్యం, నిపుణత కలిగిన మంచి మనుషులను తయారు చేయడమే. విశ్వవిద్యాలయాలు కేవలం బోధనా కేంద్రాలుగా కాకుండా, విజ్ఞానాన్ని సృష్టించే ఇంజిన్లుగా మారాలి. పరిశోధనలను ప్రోత్సహించడం ద్వారానే ఇది సాధ్యమవుతుంది" అని గవర్నర్ పేర్కొన్నారు. పారదర్శకమైన నిర్ణయాలు, జవాబుదారీతనంతో విశ్వవిద్యాలయాల విశ్వసనీయతను కాపాడాలని వీసీలకు దిశానిర్దేశం చేశారు. "ఆదర్శ ఉపాధ్యాయులు తమ విద్యార్థులకు వంతెనలుగా నిలిచి, భవిష్యత్తులో వారు సొంతంగా వంతెనలు నిర్మించుకునేలా ప్రోత్సహిస్తారు" అన్న నికోస్ కజాంత్జాకిస్ మాటలను గవర్నర్ ఈ సందర్భంగా ఉటంకించారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు మానవ వనరుల బలోపేతంపై ఆధారపడి ఉందని, ఈ లక్ష్య సాధనలో విశ్వవిద్యాలయాలు కీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు.



## సామరస్యంగా జల వివాదాల పరిష్కారం

**ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడి**

గుంటూరు, జనవరి 5 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉన్న నదీ జలాల పంపకాల వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకుందామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సహకారం అవసరమని, ఐక్యంగా ఉంటేనే దేశంలో అగ్రస్థానానికి చేరుకోగలమని ఆయన అన్నారు. సోమవారం గుంటూరులో జరిగిన మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆయన ప్రసంగించారు. పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టును ఆపాలంటూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో చంద్రబాబు వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రతి ఏటా 3,000 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో వృథాగా కలుస్తున్నాయని, గతేడాది కృష్ణా, గోదావరి నుంచి ఏకంగా 6,282 టీఎంసీల నీరు సముద్రంపాలైందని చంద్రబాబు గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని నదులన్నింటినీ అనుసంధానం చేయాల్సిందేనని, కృష్ణా-గోదావరి నదుల అనుసంధానం ప్రాజెక్టును కచ్చితంగా పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. గోదావరిలో పుష్కలంగా ఉన్న నీటిని తెలంగాణ వినియోగించుకుని కాళేశ్వరం ప్రాజెక్టు కట్టుకున్నప్పుడు కూడా ఆంధ్రప్రదేశ్ ఎలాంటి అభ్యంతరం చెప్పలేదని అన్నారు. తెలుగు ప్రజలంతా ఐక్యంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని, రెండు రాష్ట్రాల మధ్య నీటి వివాదాలను శాశ్వతంగా పరిష్కరించడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీ రామారావు అనేక ప్రాజెక్టులు చేపట్టి సాగునీటి వ్యవస్థకు బాటలు వేశారని చంద్రబాబు కొనియాడారు. నాగార్జున సాగర్ జలాలను సద్వినియోగం చేసుకునేందుకు ఎన్టీఆర్ ఎస్ఎల్‌బీసీ, ఎస్ఆర్‌బీసీ కాలువలు నిర్మించారని గుర్తుచేశారు. ఆ తర్వాత తాను ముఖ్యమంత్రిగా కల్వకుర్తి, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులను పూర్తి చేశానని తెలిపారు. కృష్ణా డెల్టా ఆధునికీకరణతో నీటిని ఆదా చేసి, తెలంగాణకు 20 టీఎంసీల నీటిని కేటాయించి భీమా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేశామని వివరించారు. గోదావరి నదిపై అలీ సాగర్, దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను కూడా చేపట్టామని తెలిపారు.



## ఎంపీపీ ఎన్నికల్లోనూ ప్రజాస్వామ్యం ఖూనీ

**కూటమి ప్రభుత్వంపై జగన్ ఆగ్రహం**

తాడేపల్లి, జనవరి 5 (ఈవార్తలు): వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్, కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సాధారణ ఎంపీపీ ఎన్నికల్లో సైతం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, ఎన్నికలను బలప్రదర్శన వేదికగా మార్చారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఉదయగిరి, రాయదుర్గం నియోజకవర్గాల్లో జరిగిన ఎంపీపీ ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలను ఉదాహరిస్తూ, కూటమి ప్రభుత్వ దురహంకారాన్ని, ప్రమాదకర స్వభావాన్ని ఈ పరిణామాలు బట్టబయలు చేస్తున్నాయని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని వింజమూరు మండలంలో ఎంపీపీ ఎన్నికలో ఓటు వేసేందుకు వెళుతున్న తమ పార్టీ ఎంపీటీసీలను నడిరోడ్డుపై అడ్డగించి, దాడులకు పాల్పడ్డారని జగన్ ఆరోపించారు. "ఈ దాడిలో ఒక మహిళా ఎంపీటీసీ తీవ్రంగా గాయపడ్డారు. ఒక సభ్యుడిని కిడ్నాప్ చేశారు. మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీటన్నింటి వెనుక ఉన్న ఏకైక ఉద్దేశం, వారు ఓటు వేయకుండా అడ్డుకోవడమే. భయాందోళనలు సృష్టించి, బలప్రయోగంతో వారి ఓటు హక్కును కాలరాయడం ద్వారా ప్రజాస్వామ్య స్ఫూర్తిని పాతేయడానికి పథకం ప్రకారం ప్రయత్నించారు" అని జగన్ వివరించారు. ఈ అప్రజాస్వామిక చర్యల సమయంలో పోలీసులు టీడీపీకి కీలుబొమ్మల్లా వ్యవహరిస్తూ, అధికార పార్టీకి మద్దతు పలికారని ఆయన విమర్శించారు. రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాల్ మండలంలో కూడా ఇదే తరహా పరిస్థితి చోటుచేసుకుందని జగన్ పేర్కొన్నారు. "అక్కడ కూడా మా వైసీపీ ఎంపీటీసీలను నిర్బంధించి దూరంగా ఉంచారు. ఇంత జరుగుతున్నా పోలీసులు, ఎన్నికల అధికారులు మూగ ప్రేక్షకుల్లా ఉండిపోయారు. వారి అండతోనే అక్కడ ఎంపీపీ ఎన్నికను బలవంతంగా పూర్తి చేశారు" అని ఆయన మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను కిడ్నాప్ చేయడం, వారిపై దాడులు చేయడం, పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేయడం వంటి చర్యలు కూటమి ప్రభుత్వంలో సర్వసాధారణమైపోయాయని జగన్ విమర్శించారు. "దేశానికి ప్రజాస్వామ్యం గురించి నీతులు చెప్పే చంద్రబాబునాయుడు, రాష్ట్రాన్ని అరాచక, ఆటవిక రాజ్యంగా మార్చినందుకు సమాధానం చెప్పాలి. ఒక చిన్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనే పరిస్థితి ఇంత దారుణంగా ఉందంటే, ఈ ప్రభుత్వం ఎంతగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందో, ఎంత ప్రజాస్వామ్య వ్యతిరేకంగా మారిందో స్పష్టమవుతోంది" అని జగన్ వ్యాఖ్యానించారు.





# బియ్యం ఉత్పత్తిలో మనమే నం.1

**చైనాను దాటేసిన భారత్**

**184 కొత్త పంట వంగడాలు విడుదల**

న్యూఢిల్లీ: బియ్యం ఉత్పత్తిలో భారత్ సరికొత్త రికార్డు సృష్టించింది. ఇప్పటివరకు అగ్రస్థానంలో ఉన్న చైనాను అధిగమించి ప్రపంచంలోనే అతిపెద్ద బియ్యం ఉత్పత్తిదారుగా అవతరించింది. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సోమవారం ఢిల్లీలో వెల్లడించారు. భారత్ 150.18 మిలియన్ టన్నుల బియ్యాన్ని ఉత్పత్తి చేయగా, చైనా ఉత్పత్తి 145.28 మిలియన్ టన్నులకే పరిమితమైందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) అభివృద్ధి చేసిన 25 రకాల పంటలకు చెందిన 184 కొత్త వంగడాలను మంత్రి విడుదల చేశారు. అధిక దిగుబడినిచ్చే విత్తనాల అభివృద్ధిలో భారత్ గొప్ప విజయం సాధించిందని, ఇప్పుడు ప్రపంచ మార్కెట్లకు బియ్యాన్ని ఎగుమతి చేసే ప్రముఖ దేశంగా మారిందని అన్నారు. ఈ కొత్త వంగడాలను సాధ్యమైనంత త్వరగా రైతులకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చేందుకు పప్పుధాన్యాలు, నూనె గింజల ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు మంత్రి సూచించారు. ప్రధాని మోదీ ప్రభుత్వ హయాంలోని గత 11 ఏళ్లలో 3,236 అధిక దిగుబడినిచ్చే వంగడాలకు ఆమోదం తెలిపినట్లు గుర్తుచేశారు. వాతావరణ మార్పులు, కరవు, నేలల లవణీయత వంటి సవాళ్లను తట్టుకునేలా ఈ కొత్త వంగడాలను రూపొందించినట్లు వివరించారు. ఒకప్పుడు ఆహార కొరత ఎదుర్కొన్న భారత్, ఇప్పుడు ప్రపంచ దేశాలకు వ్యవసాయ ఉత్పత్తులను సరఫరా చేసే స్థాయికి చేరిందని చౌహాన్ హర్షం వ్యక్తం చేశారు. ఐసీఏఆర్, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ విత్తన కంపెనీల సమిష్టి కృషితోనే ఈ విజయం సాధ్యమైందని ఆయన తెలిపారు.

## బంగ్లాదేశ్‌లో మరో హిందువు హత్య



ఢాకా: బంగ్లాదేశ్‌లో హిందూ మైనార్టీలపై దాడుల పరంపర కొనసాగుతోంది. దేశంలో నెలకొన్న అశాంతి నేపథ్యంలో, తాజాగా మరో హిందూ వ్యక్తిని గుర్తుతెలియని దుండగులు కాల్చి చంపారు. ఇటీవలి వారాల్లో ఇది ఐదో ఘటన కావడం గమనార్హం. జషోర్ జిల్లాలోని మణిరాంపూర్ ఉపజిల్లా కపాలియా బజార్‌లో సోమవారం సాయంత్రం 5:45 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. మృతుడిని సమీపంలోని అరువా గ్రామానికి చెందిన రాణా ప్రతాప్ (45)గా గుర్తించారు. ఆయన బజార్‌లో ఉన్న సమయంలో దుండగులు కాల్పులు జరిపి హత్య చేసినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. గత నెలలో విద్యార్థి నాయకుడు షరీఫ్ ఒస్మాన్ హాదీ హత్యకు గురైన నాటి నుంచి బంగ్లాదేశ్‌లో ఆందోళనలు, హింసాత్మక ఘటనలు కొనసాగుతున్నాయి. ఈ అశాంతి వాతావరణంలోనే హిందువులపై వరుస దాడులు జరుగుతున్నాయి. ఇటీవల మైమెన్‌సింగ్‌లో దైవదూషణ ఆరోపణలతో దీపు చంద్ర దాస్‌ను, రాజ్‌బరీ జిల్లాలో అమృత్ మొండల్‌ను మూకదాడుల్లో హత్య చేశారు. అలాగే, మెహ్రబరీలో బంగ్లాదేశ్ అన్సార్ దళ సభ్యుడు బజేంద్ర బిస్వాస్‌ను కాల్చి చంపగా, షరియత్‌పూర్‌లో ఖోకన్ చంద్ర దాస్ అనే వ్యాపారిని పెట్రోల్ పోసి నిప్పంటించి చంపారు. ఈ వరుస హత్యలతో బంగ్లాదేశ్‌లో హిందూ మైనార్టీల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే, కొన్ని ఘటనల్లో మతపరమైన కోణం లేదని తాత్కాలిక ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, హింస మాత్రం ఆగడం లేదు. ఈ హత్యలకు సంబంధించి ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేసినట్లుగానీ, దర్యాప్తు వివరాలను గానీ వెల్లడించలేదు.

## హిందూ, క్రిస్టియన్ యువతులే లక్ష్యం

**పాక్‌లో బలవంతపు మత మార్పిడులు**



ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో మైనారిటీ వర్గాలకు చెందిన యువతుల బలవంతపు మత మార్పిడులు ఆందోళనకర స్థాయిలో కొనసాగుతున్నాయి. ముఖ్యంగా హిందూ, క్రిస్టియన్ వర్గాల అమ్మాయిలనే లక్ష్యంగా చేసుకుని అపహరించి, బలవంతంగా ఇస్లాంలోకి మార్చి పెళ్లిళ్లు చేస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా రావల్పిండికి చెందిన 21 ఏళ్ల క్రిస్టియన్ యువతి మోనికా జెన్నిఫర్ ఉదంతం ఈ సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. గత నవంబర్‌లో మోనికా కిడ్నాప్ కు గురైంది. మోనికాను బలవంతంగా మతం మార్చారని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అయితే, తాను ఇష్టపూర్వకంగానే ఇస్లాం స్వీకరించి, తన పొరుగింటి వ్యక్తిని పెళ్లి చేసుకున్నానని మోనికా కోర్టుకు తెలపడం గమనార్హం. పాకిస్థాన్‌లో మైనర్ బాలికల వివాహాలను, తల్లిదండ్రుల అంగీకారం లేని పెళ్లిళ్లను చట్టం నిషేధించినప్పటికీ, కొందరు తీవ్రవాదులు షరియాను అడ్డం పెట్టుకుని ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఓ పాస్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలను పాకిస్థాన్ సొంత జాతీయ బాలల హక్కుల కమిషన్ నివేదిక కూడా బలపరుస్తోంది. దేశంలో మైనారిటీ పిల్లలు 'వ్యవస్థీకృత వివక్ష'ను ఎదుర్కొంటున్నారని, బలవంతపు మత మార్పిడులు అత్యంత ఆందోళన కలిగించే అంశమని ఆ నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యంగా సింధ్, దక్షిణ పంజాబ్ ప్రాంతాల్లో మైనారిటీ యువతులను అపహరించి, బెదిరించి, మతం మార్చి వయసులో బాగా పెద్దవారితో పెళ్లిళ్లు జరిపిస్తున్నారు. సింధ్‌లోని ఉమర్‌కోట్ ప్రాంతంలో ఉన్న పీర్ సర్హందీ దర్గా, హిందూ యువతుల బలవంతపు మత మార్పిడులకు ప్రధాన కేంద్రంగా మారిందని 'వాయిస్ ఆఫ్ పాకిస్తాన్ మైనారిటీ' (వీఓపీఎమ్) అనే సంస్థ సంచలన ఆరోపణలు చేసింది. వేలాది మంది హిందూ యువతులను తానే స్వయంగా ఇస్లాంలోకి మార్చానని ఆ దర్గా మత గురువు పీర్ మహమ్మద్ అయుబ్ జాన్ సర్హందీ గర్వంగా ప్రకటించుకోవడం పరిస్థితికి నిదర్శనం. యువతుల కుటుంబాలు చట్టపరంగా స్పందించేలోపే, దర్గాలోని మదర్సాలో వేగంగా మత మార్పిడి తంతు పూర్తిచేసి, దానికి చట్టబద్ధత కల్పించే ప్రయత్నం చేస్తున్నారని వీఓపీఎమ్ సంస్థ ఆరోపించింది. ఈ ఘటనలపై ఐక్యరాజ్యసమితి పలుమార్లు పాకిస్తాన్‌ను విమర్శించినా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారడం లేదు.

## నడిరోడ్డుపై శివలింగం!

**బీహార్‌లో నిలిచిపోయిన అతిపెద్ద శివలింగం తరలింపు**

**గండక్ నదిపై ఉన్న వంతెన బలహీనంగా ఉండటమే ప్రధాన కారణం**

పాట్నా: ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత బరువైన శివలింగాన్ని తరలించడం బీహార్‌లోని గోపాల్‌గంజ్ జిల్లా అధికారులకు పెద్ద సవాలుగా మారింది. గండక్ నదిపై (స్థానికంగా నారాయణి నది అని పిలుస్తారు) ఉన్న వంతెన శిథిలావస్థకు చేరడంతో శివలింగం ప్రయాణం మధ్యలోనే నిలిచిపోయింది. తమిళనాడులోని మహాబలిపురంలో తయారు చేసిన ఈ శివలింగం ఆదివారం ఉదయం గోపాల్‌గంజ్‌కు చేరుకుంది. ఈ శివలింగం బరువు సుమారు 210 టన్నులు కాగా, దీనిని తరలిస్తున్న 106 చక్రాల ప్రత్యేక ట్రైలర్ బరువు మరో 160 టన్నులు. ఈ రెండింటి మొత్తం బరువును వంతెన మోయలేదని, ప్రాథమిక తనిఖీల్లో వంతెనపై చాలాచోట్ల పగుళ్లు ఉన్నట్లు గుర్తించడంతో భద్రతాపరమైన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పరిస్థితిని సమీక్షించేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, బీహార్ రాజ్య పుల్ నిర్మాణ్ నిగమ్ లిమిటెడ్ బృందాలను పిలిపించినట్లు జిల్లా కలెక్టర్ పవన్ కుమార్ సిన్హా తెలిపారు. బీహార్ మంత్రి అశోక్ చౌదరి కూడా గోపాల్‌గంజ్‌కు వచ్చి వంతెనను స్వయంగా పరిశీలించనున్నారు. ఈ శివలింగాన్ని తూర్పు చంపారన్ జిల్లా కేంద్రమైన మోతిహారిలోని విరాట్ రామాయణ్ ఆలయానికి తరలించాల్సి ఉంది. ఇందుకోసం మహాబలిపురం నుంచి 3,178 కిలోమీటర్ల దూరం ప్రయాణించి 32 రోజుల్లో ఈ వాహనం ఇక్కడికి చేరుకుంది. అయితే, తూర్పు చంపారన్ చేరుకోవడానికి రెండు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నప్పటికీ, వాటి పరిస్థితి కూడా సంతృప్తికరంగా లేదని అధికారులు చెబుతున్నారు. ఒక మార్గంలోని వంతెన సామర్థ్యం సరిపోదని, మరో మార్గంలో కూడా అనేక చిన్న వంతెనలు, కల్వర్టులు ఉండటంతో భారీ వాహనం ప్రయాణించడం కష్టమని తేలింది. దీంతో శివలింగాన్ని సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చేందుకు అధికారులు అన్ని మార్గాలను అన్వేషిస్తున్నారు.



## రోజుకు 45 వేల మంది కొత్త యూజర్లు

**భారత్ ట్యాక్సీకి పెరుగుతున్న ఆదరణ**

న్యూఢిల్లీ: దేశీయ రైడ్-హెయిలింగ్ మార్కెట్‌లో ఓలా, ఊబర్ వంటి దిగ్గజ సంస్థలకు గట్టిపోటీ ఇచ్చేందుకు ప్రభుత్వ మద్దతుతో కొత్త క్యాబ్ సర్వీస్ యాప్ వచ్చేసింది. కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ సహకారంతో ప్రారంభమైన 'భారత్ ట్యాక్సీ' యాప్‌కు వినియోగదారుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే ఈ యాప్‌కు భారీ ఆదరణ దక్కుతుండటం విశేషం. గత రెండు రోజులుగా ప్రతిరోజూ సుమారు 40,000 నుంచి 45,000 మంది కొత్త యూజర్లు ఈ యాప్‌లో రిజిస్టర్ చేసుకుంటున్నారని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో తెలిపింది. ఇప్పటికే మొత్తం రిజిస్టర్డ్ కస్టమర్ల సంఖ్య 4 లక్షలు దాటిందని పేర్కొంది. ప్రస్తుతం ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్‌లో 9వ స్థానంలో, యాపిల్ యాప్ స్టోర్‌లో 13వ స్థానంలో ట్రెండ్ అవుతోంది. కేంద్ర మంత్రి అమిత్ షా నేతృత్వంలోని 'ఆత్మనిర్భర్ భారత్', 'సహకార్ సే సమృద్ధి' దార్శనికతలో భాగంగా ఈ యాప్‌ను దేశవ్యాప్తంగా విస్తరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. పోలీస్ వెరిఫైడ్ డ్రైవర్లు, మెరుగైన భద్రతా ఫీచర్లతో ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించడమే లక్ష్యమని తెలిపింది. యాప్‌లో అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించడం, సైరన్ మోగించడం వంటి ఫీచర్లు ఉన్నాయి. అయితే, ప్రారంభ దశలో కొన్ని పరిమితులు కూడా కనిపిస్తున్నాయి. ఛార్జీలు ఎప్పుడూ పోటీ యాప్‌ల కంటే తక్కువగా ఉండటం లేదు. కొన్నిసార్లు ఏసీ, నాన్-ఏసీ క్యాబ్‌లకు ఒకే ధర చూపించడం వంటివి యాప్‌ను ఇంకా మెరుగుపరచాల్సి ఉందని సూచిస్తున్నాయి. డ్రైవర్లను ప్రోత్సహించేందుకు, వారి నుంచి ఎలాంటి కమీషన్ వసూలు చేయబోమని, ప్రయాణికులు చెల్లించిన పూర్తి ఛార్జీని వారే ఉంచుకోవచ్చని 'భారత్ ట్యాక్సీ' ప్రకటించింది. భవిష్యత్తులో విమానాశ్రయాలు, ఇతర రవాణా కేంద్రాల్లో ప్రత్యేక పికప్, డ్రాప్ జోన్‌లను ఏర్పాటు చేసేందుకు కూడా ప్రణాళికలు రచిస్తోంది.

## జేడీ వాన్స్ ఇంటిపై దాడి

వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నివాసం వద్ద సోమవారం తెల్లవారుజామున కలకలం రేగింది. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. సీక్రెట్ సర్వీస్, సిన్సినాటి పోలీసులు సంయుక్తంగా ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. వివరాల్లోకి వెళితే, ఒహాయో రాష్ట్రంలోని సిన్సినాటి నగరంలో సోమవారం అర్ధరాత్రి దాటాక సుమారు 12:15 గంటలకు జేడీ వాన్స్ నివాసం సమీపంలో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా పరుగెడుతున్నట్లు సీక్రెట్ సర్వీస్ సిబ్బంది గుర్తించారు. వెంటనే వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఇంటి కిటికీ అద్దాలు పగిలిపోయి ఉండటాన్ని గమనించారు. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే, ఈ ఘటన జరిగిన సమయంలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఆయన కుటుంబ సభ్యులు ఇంట్లో లేరని అధికారులు స్పష్టం చేశారు. సెలవుల అనంతరం ఆదివారమే ఆయన వాషింగ్టన్ డీసీకి బయలుదేరి వెళ్లినట్లు తెలిసింది. అదుపులోకి తీసుకున్న వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించే ప్రయత్నం చేయలేదని ప్రాథమికంగా భావిస్తున్నారు. అతడు ఉపాధ్యక్షుడిని లక్ష్యంగా చేసుకుని ఈ చర్యకు పాల్పడ్డాడా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటనపై వైట్ హౌస్ లేదా సీక్రెట్ సర్వీస్ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# టారిఫ్‌లతో 49.8 లక్షల కోట్లు ఆర్జించాం

**దేశం ఆర్థికంగా, భద్రతాపరంగా బలపడింది: ట్రంప్**




వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం టారిఫ్‌ల విధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. టారిఫ్‌ల (సుంకాలు) ద్వారా తమ దేశానికి 600 బిలియన్ డాలర్లకు పైగా ఆదాయం వచ్చిందని, త్వరలో మరిన్ని నిధులు రానున్నాయని ఆయన ప్రకటించారు. భారత కరెన్సీలో దీని విలువ సుమారు రూ.49.8 లక్షల కోట్లు. ఈ విధానం వల్ల దేశం ఆర్థికంగా బలపడటమే కాకుండా, జాతీయ భద్రత కూడా మెరుగుపడిందని ట్రంప్ వాదించారు. సుప్రీంకోర్టులో రానున్న కీలక తీర్పు నేపథ్యంలో మీడియా ఈ అంశాన్ని తక్కువ చేసి చూపుతోందని ఆయన ఆరోపించారు. తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో ఆయన ఒక పోస్ట్ చేశారు. "మేం టారిఫ్‌ల ద్వారా 600 బిలియన్ డాలర్లకు పైగా వసూలు చేశాం. కానీ ఫేక్ న్యూస్ మీడియా దీని గురించి మాట్లాడటానికి ఇష్టపడటం లేదు. ఎందుకంటే వారు మన దేశాన్ని ద్వేషిస్తారు, అగౌరవపరుస్తారు. సుప్రీంకోర్టులో రానున్న అత్యంత కీలకమైన టారిఫ్‌ల నిర్ణయాన్ని ప్రభావితం చేయడానికే మీడియా ఇలా చేస్తోంది" అని ట్రంప్ ఆరోపించారు. టారిఫ్‌ల వల్లే అమెరికా మునుపెన్నడూ లేనంతగా ఆర్థికంగా, జాతీయ భద్రతాపరంగా బలంగా ఉందని, ప్రపంచంలో గౌరవం పెరిగిందని ఆయన పేర్కొన్నారు. 2025 జనవరిలో అధికారంలోకి వచ్చిన వెంటనే ట్రంప్, ఆయన బృందం టారిఫ్‌లను జాతీయ భద్రత, విదేశాంగ విధాన సాధనంగా ఉపయోగించడం ప్రారంభించడం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రపంచంలోని పలు దేశాల నుంచి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై భారీ సుంకాలు విధించారు. ముఖ్యంగా భారత ఉత్పత్తులపై 50 శాతం టారిఫ్ విధించారు. ఈ నేపథ్యంలో భారత్ తన ఎగుమతుల కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోందని 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' పత్రిక ఒక కథనంలో పేర్కొంది. అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, ఇతర దేశాలకు ఎగుమతులను విస్తరించేందుకు భారత్ ప్రణాళికలు రచిస్తోందని, ఈ విధానం రానున్న రోజుల్లో మరింత వేగవంతం కానుందని ఆ కథనం హైలైట్ చేసింది. భారత్‌కు అమెరికా అతిపెద్ద ఎగుమతి మార్కెట్ గా ఉంది. మన దేశ మొత్తం వస్తు ఎగుమతుల్లో దాదాపు 18 శాతం అమెరికాకే వెళుతున్నాయి. గార్మెంట్స్, లెదర్ ఉత్పత్తులు వంటివి ఇందులో ప్రధానమైనవి. అయితే, వ్యవసాయం, డెయిరీ వంటి సున్నితమైన రంగాల్లో అమెరికా ఉత్పత్తులకు ద్వారాలు తెరిచే విషయంలో భారత్ దృఢమైన వైఖరితో ఉండటంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదరడంపై సందేహాలున్నాయి.

# ఫెడరల్ కోర్టుకు మదురో

**బెయిల్ రావడం కష్టమే**

**నేరం రుజువైతే మరణశిక్ష!**


బ్రూక్లిన్: వెనిజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను అమెరికా అధికారులు ఫెడరల్ కోర్టులో హాజరుపరిచారు. నార్కో టెర్రరిజం సహా పలు తీవ్రమైన ఆరోపణలపై వారిని విచారిస్తున్నారు. వెనిజువెలాలో అమెరికా దళాలు జరిపిన మెరుపుదాడిలో శనివారం పట్టుబడిన వీరిని న్యూయార్క్‌కు తరలించారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ఫెడరల్ జడ్జి అల్విన్ హెల్లర్‌స్టెయిన్ ఎదుట వారిని ప్రవేశపెట్టారు. భారీ భద్రత నడుమ మదురో దంపతులను బ్రూక్లిన్‌లోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్ నుంచి హెలికాప్టర్‌లో మాన్‌హటన్‌లోని కోర్టుకు తరలించారు. కోర్టు తరఫున నియమితులైన లాయర్ డేవిడ్ విక్‌స్ట్రోమ్ వీరి తరఫున వాదనలు వినిపించనున్నారు. విచారణలో భాగంగా తాము నిర్దోషులమని వారు చెప్పే అవకాశం ఉంది. అయితే, కేసు తీవ్రత దృష్ట్యా వారికి బెయిల్ లభించడం దాదాపు అసాధ్యమని, కస్టడీకి పంపడం ఖాయమని తెలుస్తోంది. మదురోపై మోపిన అభియోగాలు చాలా తీవ్రమైనవి. టన్నుల కొద్దీ కొకైన్‌ను అమెరికాకు రవాణా చేయడం, దీనికోసం వెనిజువెలా సైన్యాన్ని, రహస్య ఎయిర్‌స్ట్రిప్‌లను వాడుకోవడం (నార్కో-టెర్రరిజం), అక్రమంగా మెషిన్ గన్లు కలిగి ఉండటం, మనీలాండరింగ్ వంటి కేసులు ఉన్నాయి. ఈ ఆరోపణలు రుజువైతే మరణశిక్ష పడే అవకాశం కూడా ఉంది. ఇప్పటికే స్విట్జర్లాండ్ ఆయన ఆస్తులను స్తంభింపజేసింది. మరోవైపు, కోర్టు వెలుపల మదురో మద్దతుదారులు, వ్యతిరేకులు వందల సంఖ్యలో గుమిగూడారు. ఇరువర్గాల మధ్య ఘర్షణలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మదురోను ఉంచిన ఎండీసీ జైలు అత్యంత కఠినమైన భద్రతకు, దారుణమైన పరిస్థితులకు పేరుగాంచింది. గతంలో మెక్సికన్ డ్రగ్ లార్డ్ 'ఎల్ చాపో' గుజ్‌మాన్, ఆర్థిక నేరగాడు సామ్ బ్యాంక్‌మన్-ఫ్రైడ్ వంటి కరడుగట్టిన నేరగాళ్లను ఈ జైలులోనే ఉంచారు.



# గాలి కాలుష్యంతో ఇంధనం

**ఐఐటీ గౌహతి శాస్త్రవేత్తల అద్భుత ఆవిష్కరణ**

గౌహతి: పర్యావరణ పరిరక్షణ, హరిత ఇంధన ఉత్పత్తి దిశగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) గౌహతి పరిశోధకులు ఒక కీలక ముందడుగు వేశారు. గాలిలోని హానికారక కార్బన్ డై ఆక్సైడ్‌ను సూర్యరశ్మి సహాయంతో మిథనాల్ ఇంధనంగా మార్చగల ఒక సరికొత్త పదార్థాన్ని (ఫోటోకెటలిస్ట్) విజయవంతంగా అభివృద్ధి చేశారు. ఈ పరిశోధన వివరాలను ప్రతిష్ఠాత్మక 'జర్నల్ ఆఫ్ మెటీరియల్స్ సైన్స్' ప్రచురించింది. పెట్రోలియం ఆధారిత ఇంధనాల వాడకం వల్ల వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ పెరిగిపోతూ పర్యావరణానికి, భూతాపానికి కారణమవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పెరుగుతున్న ఇంధన అవసరాలను తీరుస్తూనే, పర్యావరణానికి హాని కలగకుండా చూసేందుకు ఈ కొత్త టెక్నాలజీ దోహదపడుతుంది. థర్మల్ పవర్ ప్లాంట్లు, సిమెంట్, ఉక్కు, పెట్రోకెమికల్ పరిశ్రమల నుంచి వెలువడే జూ□ను ఇంధనంగా మార్చడం ద్వారా కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. గతంలో గ్రాఫిటిక్ కార్బన్ నైట్రైడ్ అనే పదార్థంతో ఇలాంటి ప్రయత్నాలు జరిగినా, శక్తి నష్టం కారణంగా అవి విఫలమయ్యాయి. అయితే, ఐఐటీ గువాహటి బృందం గ్రాఫిటిక్ కార్బన్ నైట్రైడ్‌కు 'ఫ్యూ-లేయర్ గ్రాఫీన్'ను జోడించి ఈ సమస్యను అధిగమించింది. గ్రాఫీన్ కలపడం వల్ల ఈ మిశ్రమం సూర్యరశ్మిని సమర్థవంతంగా గ్రహించి, శక్తి నష్టాన్ని తగ్గించి, ఎక్కువ సేపు చురుకుగా పనిచేస్తున్నట్లు పరిశోధనలో తేలింది. 15 శాతం గ్రాఫీన్ ఉన్న మిశ్రమం అత్యంత మెరుగైన ఫలితాలను ఇచ్చిందని శాస్త్రవేత్తలు తెలిపారు. "ఈ పరిశోధన పర్యావరణ సమస్యలను తగ్గించడంతో పాటు, హరిత ఇంధన ఉత్పత్తికి ఎంతగానో దోహదపడుతుంది" అని ఐఐటీ గువాహటి కెమికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ మహుయా దే వివరించారు. తదుపరి దశలో ఈ టెక్నాలజీని పెద్ద ఎత్తున పరిశ్రమలలో వాడేందుకు వీలుగా అభివృద్ధి చేయాలని పరిశోధక బృందం లక్ష్యంగా పెట్టుకుంది.



## వయ్యారి చిత్రం




## ప్రభాస్ టార్గెట్.. మినిమం 400 కోట్లు



ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం రాజాసాబ్ సినిమా బడ్జెట్ అక్షరాలా 350 కోట్ల రూపాయలు. ఒక హారర్ కామెడీ జానర్ సినిమాకు ఇంత భారీ మొత్తం ఖర్చు చేశారంటే అవుట్ పుట్ మీద మేకర్స్ కు ఎంత నమ్మకం ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రభాస్ మార్కెట్ రేంజ్, గ్లోబల్ ఆడియన్స్ టేస్ట్ ను దృష్టిలో పెట్టుకుని ఈ సినిమాను భారీ స్థాయిలో మలిచారు. ఇంత బడ్జెట్ పెట్టినప్పుడు రికవరీ ఎలా ఉంటుందనే సందేహం రావడం సహజం. అక్కడే మన డార్లింగ్ క్రేజ్ ఏంటో బయటపడింది. సినిమా థియేటర్లలోకి రాకముందే నాన్ థియేట్రికల్ రైట్స్ ద్వారానే సగం బడ్జెట్ వెనక్కి వచ్చేసింది. ఆడియో రైట్స్ టీ సిరీస్ దక్కించుకోగా, డిజిటల్ ఇంకా శాటిలైట్ హక్కులను జియో హాట్ స్టార్ భారీ ధరకు సొంతం చేసుకుంది. దీంతో రిలీజ్ కు ముందే నిర్మాత సగం సేఫ్ అయ్యారు. ఇక బిజినెస్ విషయంలో నిర్మాత తీసుకున్న నిర్ణయం కూడా ఆసక్తికరంగా ఉంది. ఈ సినిమా హక్కులను ఎవరికీ అమ్మకుండా, నిర్మాతలే స్వయంగా అన్ని భాషల్లోనూ, అన్ని ఏరియాల్లోనూ సొంతంగా విడుదల చేస్తున్నారు. డిస్ట్రిబ్యూటర్ల దగ్గర అడ్వాన్స్ లు తీసుకుని, వాళ్లకు కొంత కమిషన్ ఇచ్చే పద్ధతిని ఫాలో అవుతున్నారు. సినిమా మీద ఉన్న కాన్ఫిడెన్స్ తోనే ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫైనల్ గా ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర సేఫ్ జోన్ లోకి రావాలంటే వరల్డ్ వైడ్ గా 400 కోట్ల గ్రాస్ వసూలు చేయాల్సి ఉంటుంది. అంటే షేర్ పరంగా చూస్తే దాదాపు 200 కోట్లు రాబట్టాలి. ప్రభాస్ స్టార్ డమ్ కు, సంక్రాంతి సీజన్ కలిసొస్తే ఇదేమీ పెద్ద టార్గెట్ కాదు. పాజిటివ్ టాక్ వస్తే మాత్రం మొదటి వారంలోనే ఈ మార్క్ ను దాటేసే అవకాశం ఉంది.

## మే 1న లెనిన్ రిలీజ్



రాయలసీమ బ్యాక్ డ్రాప్ లవ్‌స్టోరీగా తెరకెక్కుతున్న లెనిస్ సినిమా వాస్తవానికి ఎప్పుడో రిలీజవాల్సింది. కానీ కొంతభాగం షూటింగ్ పూర్తయ్యాక శ్రీలీల లెనిన్ నుంచి తప్పుకోవడంతో భాగ్య శ్రీ బోర్సేతో మళ్లీ ఆ షూటింగ్ అంతా పూర్తయ్యేసరికి టైమ్ పట్టింది. అయితే ఇప్పుడీ సినిమా షూటింగ్ ఆల్మోస్ట్ పూర్తవడానికి వచ్చినట్టు రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో నిర్మాత నాగ వంశీ కూడా చెప్పగా, తాజాగా లెనిన్ నుంచి ఫస్ట్ సింగిల్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. హే ఇన్నవా.. అంటూ సాగే ఫస్ట్ సింగిల్ రాగా ఈ సాంగ్ అందరినీ ఆకట్టుకుంటుంది. తమన్ సంగీతంలో వచ్చిన ఈ సాంగ్ వినగానే నచ్చేలా మంచి ట్యూన్ తో వచ్చింది. అనంత శ్రీరామ్ సాహిత్యం అందించిన ఈ పాటను శ్వేతా మోహన్, జుబిన్ ఆలపించగా, ఈ సాంగ్ తో పాటూ మేకర్స్ లెనిన్ మూవీ రిలీజ్ డేట్ ను కూడా అనౌన్స్ చేశారు. సాంగ్ చూస్తుంటే పల్లెటూరు బ్యాక్ డ్రాప్ లో జాతరను తలపిస్తూ ఈ సాంగ్ కొనసాగుతుందని అర్థమవుతుంది. ఇక సినిమా విషయానికొస్తే ఈ మూవీలో అఖిల్ మాస్ లుక్ లో కనిపించనుండగా, లెనిన్ సినిమాను మే 1వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్టు మేకర్స్ ఫస్ట్ సింగిల్ తో పాటూ అనౌన్స్ చేశారు.

## చిరుతో కలిసి కేథరిన్ స్టెప్పులు!





కేథరిన్ కు గతంలో మెగాస్టార్ చిరంజీవి రీఎంట్రీ సినిమా ఖైదీ నెం.150లో ఐటెమ్ సాంగ్ చేసే అవకాశం వచ్చినట్టే వచ్చే చేజారింది. ఆ ఐటెమ్ సాంగ్ ను కేథరిన్ కు బదులు లక్ష్మీ రాయ్ తో చేయించారు. అప్పుడు ఛాన్స్ కోల్పోయినా సరే కేథరిన్ కు ఇప్పుడు మరోసారి చిరూ తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకునే ఛాన్స్ ను అందుకున్నారు. చిరంజీవి తాజా సినిమా మన శంకరవరప్రసాద్ గారు మూవీలో కేథరిన్ కీలకపాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాపై కేథరిన్ చాలానే ఆశలు పెట్టుకున్నారు. మరి అప్పట్లో మెగాస్టార్ తో కలిసి స్టెప్పులేసే అవకాశాన్ని కోల్పోయిన కేథరిన్ కు ఈ మూవీలో ఏమైనా చిరూతో కలిసి కాలు కదిపే ఛాన్సొస్తుందేమో చూడాలి. కాగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన మన శంకరవరప్రసాద్ గారు సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## రుక్మిణికి మరో టాలీవుడ్ చాన్స్



ఎన్టీఆర్- ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న సినిమాలో హీరోయిన్ గా నటిస్తున్న రుక్మిణి, కాంతార సినిమాతో మంచి బ్లాక్ బస్టర్ అందుకోవడంతో ఈ మూవీ తర్వాత తనకు అవకాశాలు విపరీతంగా వస్తున్నట్టు తెలుస్తోంది. ఆల్రెడీ పలు పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తున్న రుక్మిణి, రామ్ చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాలో కూడా ఎంపికైనట్టు వార్తలొస్తున్నాయి. ఇవి కాకుండా రుక్మిణి ఇప్పుడు మరో తెలుగు సినిమాకు సైన్ చేసినట్టు తెలుస్తోంది. శర్వానంద్ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వంలో రానున్న ఓ సినిమాలో రుక్మిణిని హీరోయిన్ గా ఫైనల్ చేసినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ మూవీ మార్చి నుంచి రెగ్యులర్ షూటింగ్ కు వెళ్లనున్నట్టు తెలుస్తోంది. వరుస ఫ్లాపుల్లో ఉన్న శ్రీను వైట్ల ఈ సినిమాతో ఎలాగైనా మంచి హిట్ అందుకుని సాలిడ్ కంబ్యాక్ ఇవ్వాలని చూస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్న ఈ మూవీలో మరో సీనియర్ హీరో నటించనున్నట్టు తెలుస్తోంది. మొత్తానికి రుక్మిణికి పెద్ద బ్యానర్లలో అవకాశాలు మాత్రం వరుస పెట్టి వస్తున్నాయి.

## కడప నేతల నుంచి బ్లాక్ మెయిల్



ఓ ప్రముఖ రాజకీయ పార్టీకి చెందిన వర్గం, కీలక నేతపై పూనమ్ కౌర్ సంచలన ఆరోపణలు చేసింది. ఏపీలోని ఓ రాజకీయ పార్టీకి చెందిన నేతలు తనను దారుణంగా వేధించారని తెలిపారు. ఒక సందర్భంలో కడపకు చెందిన కొంతమంది వ్యక్తులు తనను సంప్రదించారని, నటుడికి వ్యతిరేకంగా మాట్లాడాలని ప్రెస్ మీట్ ఏర్పాటు చేయాలని బెదిరించారని ఆరోపించారు. దీంతో తనకేం మాట్లాడాలో అర్థం కాలేదని చెప్పిన పూనమ్ కౌర్.. ఆ తర్వాత ఎందుకు వచ్చారని అడగడంతో దారుణమైన విషయాలు మాట్లాడారని ఆరోపణలు చేశారు. ఓ స్టార్ హీరోపై అభాండాలు వేయాలని, విమర్శలు చేయాలని, ఆరోపణలు చేయాలని చెప్పినట్టు ఆరోపించారు. అందుకు అడిగినంత డబ్బు ఇస్తామని చెప్పినట్లు తెలిపారు. అంతే కాదు రాష్ట్ర ప్రభుత్వంలో ఓ పదవి ఇచ్చి హోదా కల్పిస్తామని చెప్పారట. కానీ తాను అందుకు ఒప్పుకోకపోవడంతో చాలా నీచంగా బెదిరించారని, ఆ సమయంలో తాను దేవుడిపైనే భారం వేశానని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కడప నేత చేసిన బెదిరింపులు, బ్లాక్ మెయిల్ ఇప్పటి వరకు ఎవరికీ చెప్పలేదని అన్నారు పూనమ్.

## సారీ రాశీ మేడమ్





రీసెంట్ గా ఓ కార్యక్రమంలో యాక్టర్ శివాజీ ఆడవారి వేషధారణ పై చేసిన కామెంట్స్ ఎంత హాట్ టాపిక్ గా మారాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. వయసులో పెద్ద వాడు అయుండి శివాజీ అలా ఎలా మాట్లాడతారని ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ ఎంతోమంది నటీమణులు ఈ విషయంలో రెస్పాండ్ అయ్యారు. శివాజీ కామెంట్స్ ను వ్యతిరేకిస్తూ అనసూయ కూడా వార్తల్లోకెక్కిన విషయం తెలిసిందే. ఎవరికి నచ్చిన బట్టలు వారు వేసుకునే స్వేచ్ఛ ఉందని, దీనిపై మాట్లాడే హక్కు ఎవరికీ లేదని అనసూయ కామెంట్స్ చేశారు. అయితే ఈ విషయంలో కొందరు శివాజీకి సపోర్ట్ చేస్తుంటే, మరికొందరు అనసూయకు సపోర్ట్ చేస్తూ వచ్చారు. కాగా తాజాగా ఈ వివాదంలోకి సీనియర్ నటి రాశీ ఎంట్రీ ఇచ్చారు. రీసెంట్ గా రాశీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, అనసూయపై కామెంట్స్ చేశారు. శివాజీ హీరోయిన్లు వేసుకునే బట్టలు గురించి మాట్లాడటం తప్పేనని, దాన్ని తాను కూడా సమర్థించడం లేదని, కొన్ని వాడకూడని పదాలు వాడారని, ఆ తర్వాత అలా మాట్లాడినందుకు శివాజీ కూడా డాధ పడి, క్షమాపణలు కూడా చెప్పారని, ఇదంతా పక్కన పెడితే గతంలో ఓ కామెడీ షోకు యాంకర్ గా వ్యవహరించే టైమ్ లో అనసూయ తనను ట్రోల్ చేశారని చెప్పారు. రాశీ చేసిన కామెంట్స్ నెట్టింట వైరలవుతున్న టైమ్ లో ఆ వీడియోపై స్పందిస్తూ అనసూయ ఓ పోస్ట్ పెట్టారు. ఆ పోస్ట్ లో తాను మూడేళ్ల కిందట చేసిన ఓ షో లో తెలుగు సరిగా రానితనంపై చేసిన స్కిట్ లో రాశి పేరుని వాడి తన నోటి నుంచి డబుల్ మీనింగ్ డైలాగ్ చెప్పించారని, అలా రాయించిన వారిని అప్పుడే ఎదిరించాల్సిందని, కానీ అప్పుడు తనకున్న శక్తి సహకరించలేదని, అది తప్పేనని, దానికి సారీ చెప్తున్నానని రాసుకొచ్చింది.



# బంగ్లాదేశ్‌లో ఐపీఎల్ బ్యాన్

**ముస్తాఫిజుర్ ఎఫెక్టే..!**

బంగ్లాదేశ్ లో హిందువులపై దాడి నేపథ్యంలో భారత్–బంగ్లా మధ్య వివాదం మొదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఐపీఎల్ టీం నుంచి బంగ్లా ఆటగాడు ముస్తాఫిజుర్ ను తొలగించాలని బీసీసీఐ ఆదేశించింది. దీంతో బంగ్లా–భారత్ మధ్య సంబంధాలు మరింత దిగజారుతున్నాయి. ముస్తాఫిజుర్ ను తొలగించినందుకు నిరసనగా.. బంగ్లాదేశ్ లో ఐపీఎల్ పై నిషేధం విధించాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం దేశంలో ఐపీఎల్ ప్రసారాలతోపాటు, ప్రచారం కూడా చేయకూడదు. ఈ మేరకు బంగ్లా ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఇటీవల మినీ వేలంలో ముస్తాఫిజుర్ ను కోల్ కతా జట్టు రూ.9.2 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో దేశవ్యాప్తంగా పలువురు కేకేఆర్, బీసీసీఐపై విమర్శలు చేశారు. ఒక పక్క బంగ్లాదేశ్ లో హిందువులపై దాడులు జరుగుతుంటే.. ఆ దేశానికి చెందిన క్రీడాకారుడిని ఐపీఎల్ టీంలోకి తీసుకోవడంపై సోషల్ మీడియా వేదికగా పలువురు విమర్శించారు. దీంతో స్పందించిన బీసీసీఐ అతడిని తొలగించాలని కేకేఆర్ కు ఆదేశాలు జారీ చేసింది. అతడి స్థానంలో మరొకరిని తీసుకునేందుకు అనుమతిస్తామని చెప్పింది. దీంతో ముస్తాఫిజుర్ ను కేకేఆర్ విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీనిపై బంగ్లా క్రికెట్ బోర్డ్ (బీసీబీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. బీసీసీఐ నిర్ణయం బంగ్లా ప్రజల్ని ఆగ్రహానికి, విస్మయానికి గురి చేసిందని తెలిపింది. ఇలా చేస్తే.. ఇండియాలో జరగబోయే టీ20 వరల్డ్ కప్ లు తమ జట్టు పాల్గొనబోదని, తమ జట్టు ఆడే



మ్యాచుల వేదికలు ఇండియా నుంచి మార్చాలని ఐసీసీని కోరింది. తమ క్రికెటర్ల భద్రత రీత్యా తమ ఆటగాళ్లను ఇండియా పంపించకూడదని నిర్ణయించుకున్నట్లు బీసీబీ తెలిపింది. ఈ అంశంపై త్వరలోనే ఐసీసీ చర్చించనుంది. ఇప్పటికే నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం.. బంగ్లాదేశ్.. ఇండియాలో నాలుగు మ్యాచులు ఆడాల్సి ఉంది. ఒకవేళ బీసీబీ కోరినట్లు ఇండియా నుంచి వేదికలు మారిస్తే.. శ్రీలంకలో ఆడే ఛాన్స్ ఉంది.

# నేటి మ్యాచ్‌కు కోహ్లీ దూరం!



విరాట్ కోహ్లీ అభిమానులకు బ్యాడ్ న్యూస్. ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా మంగళవారం రైల్వేస్‌తో ఢిల్లీ ఆడనున్న మ్యాచ్‌కు విరాట్ కోహ్లీ దూరమైనట్లు తెలుస్తోంది. ముందస్తు షెడ్యూల్ ప్రకారం విరాట్ కోహ్లీ ఈ మ్యాచ్ ఆడాల్సింది. ఈ వార్తలను ఢిల్లీ క్రికెట్ అసోసియేషన్ కూడా ధ్రువీకరించింది. కానీ ఏమైందో ఏమో తెలియదు కానీ.. విజయ్ హజారే ట్రోఫీ ఐదో రౌండ్ మ్యాచ్‌కు విరాట్ కోహ్లీ అందుబాటులో లేదని ఓ వార్త సంస్థ పేర్కొంది. ఈ టోర్నీలో ఢిల్లీ తరఫున రెండు మ్యాచ్‌ల్లో బరిలోకి దిగిన కోహ్లీ.. అద్భుత ప్రదర్శన కనబర్చాడు. ఆంధ్రపై(131) సెంచరీతో చెలరేగిన కోహ్లీ.. గుజరాత్‌పై హాఫ్ సెంచరీ(77) రాణించాడు. అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు లేని సమయంలో భారత ఆటగాళ్లు దేశవాళీ క్రికెట్ ఆడాలనే బీసీసీఐ నయా రూల్‌తో 15 ఏళ్ల తర్వాత కోహ్లీ ఈ టోర్నీ ఆడాడు. టెస్ట్, టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ కేవలం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్న సంగతి తెలిసిందే. వన్డే ప్రపంచకప్ 2027 ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఆస్ట్రేలియా పర్యటనలో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో డకౌట్ అయిన కోహ్లీ.. మూడో వన్డేలో అజేయ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో వరుసగా రెండు సెంచరీలు, హాఫ్ సెంచరీ(135, 102, 65 నాటౌట్) సత్తా చాటాడు. ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉన్న విరాట్ కోహ్లీ.. జనవరి 11 నుంచి న్యూజిలాండ్‌తో ప్రారంభమయ్యే మూడు వన్డేల సిరీస్‌లో బరిలోకి దిగనున్నాడు. ఈ సిరీస్‌కు సన్నాహకంగానే అతను విజయ్ హజారే ట్రోఫీ ఐదో రౌండ్ మ్యాచ్ ఆడాలనుకున్నాడు. కానీ చివరి నిమిషంలో కోహ్లీ ఈ మ్యాచ్‌కు దూరమవడంతో అతని అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. విజయ్ హజారే ట్రోఫీ ఎలైట్ గ్రూప్–డీలో ఉన్న ఢిల్లీ 5 మ్యాచ్‌ల్లో 4 విజయాలతో అగ్రస్థానంలో నిలిచింది. చివరి రెండు మ్యాచ్‌ల్లో ఒక్కటి గెలిచినా ఆ జట్టు క్వార్టర్స్‌కు చేరుతుంది.



# తండ్రైన అంబటి రాయుడు

భారత మాజీ క్రికెటర్, తెలుగు తేజం అంబటి రాయుడు మరోసారి తండ్రయ్యాడు. అతని సతీమణి విద్య మగ బిడ్డకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని రాయుడు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించాడు. తన భార్య, బిడ్డతో ఉన్న ఫొటోను రాయుడు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నాడు. 'మాకు కొడుకు పుట్టాడు.. సంతోషంగా ఉంది' అని రాయుడు క్యాప్షన్‌గా పేర్కొన్నాడు. అంబటి రాయుడు, విద్యకు 2009లో వివాహం జరగ్గా.. 2020 జూలైలో ఈ దంపతులకు మొదటి సంతానంగా ఆడ బిడ్డ జన్మించింది. ఆ పాపకు వివియా అని పేరు పెట్టారు. అనంతరం 2023లో రెండోసారి తండ్రి కాగా.. మరోసారి కూతురే పుట్టింది. తాజాగా 40 ఏళ్ల వయసులో అంబటి రాయుడు మూడో సారి తండ్రి కాగా.. ఈసారి మగ బిడ్డ పుట్టాడు.



# ధవన్ మళ్లీ పెళ్లి..!

భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారు. ఆయన తన ప్రియురాలు సోఫీ షైన్ ను వివాహమాడనున్నారు. వచ్చే ఫిబ్రవరి మూడో వారంలో, ఢిల్లీలో ఘనంగా వీరి వివాహం జరగనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పెళ్లి వేడుకకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయని శిఖర్ సన్నిహితులు చెబుతున్నారు. ఇక సోఫీ షైన్ ఐర్లాండ్ దేశస్తురాలు. శిఖర్, సోఫీ కొన్నేళ్లక్రితం దుబాయ్ లో కలుసుకున్నారు. వారి పరిచయం స్నేహంగా, అనంతరం ప్రేమగా మారింది. వీరిద్దరూ కొంతకాలం నుంచి డేటింగ్ లో ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత ఇటీవలే వీరి రిలేషన్ ను సోషల్ మీడియా వేదికగా బయటపెట్టుకున్నారు. ఇద్దరూ తాము కలిసున్న ఫొటోల్ని షేర్ చేసుకున్నారు. దీంతో వీరి బంధాన్ని అధికారికంగా ప్రకటించుకున్నట్లైంది. అయితే, శిఖర్ కు గతంలోనే వివాహం జరిగింది. ఆస్ట్రేలియాకు చెందిన అయేషా ముఖర్జీని శిఖర్ వివాహం చేసుకోగా, వారికి జొరావర్ ధావన్ అనే 11 ఏళ్ల కొడుకు ఉన్నాడు. కొంతకాలం క్రితం విడాకులు తీసుకున్నారు.



# నా ఫొటోలను మార్ఫింగ్ చేయవద్దు: ప్రతీకా రావల్

దయచేసి తన ఫొటోలను మార్ఫింగ్, ఎడిట్ చేయవద్దని ఎక్స్ ఏఐ ఫ్లాట్‌ఫామ్ గ్రోక్‌ను భారత మహిళా క్రికెటర్ ప్రతీకా రావల్ కోరింది. ఇటీవల ఎక్స్‌వేదికగా ఫొటోలను ఎడిట్ చేయడం, మార్ఫ్ చేయడం ట్రెండింగ్‌గా మారిన సంగతి తెలిసిందే. కొన్ని ఫొటోల నుంచి వ్యక్తులను తీసేయడం, డ్రెస్ కలర్స్‌ను మార్చడం వంటి పనులను నెటిజన్లు గ్రోక్ సాయంతో చేశారు. గత కొన్నిరోజులుగా ఎక్స్‌లో ఇది బాగా ట్రెండ్ అవుతుంది. ఈ క్రమంలోనే తన ఫొటోలను మార్ఫింగ్, ఎడిట్ చేయవద్దని, ఇతర యూజర్లు అడిగినా నిరాకరించాలని గ్రోక్‌ను ఎక్స్ వేదికగా ప్రతీకా రావల్ విజ్ఞప్తి చేసింది. ఆమె అభ్యర్థనకు సానుకూలంగా స్పందించిన గ్రోక్.. వ్యక్తిగత గోప్యతను కాపాడుతామని మాట ఇచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్‌లు నెట్టింట వైరల్‌గా మారాయి. 'హే ఏస్త్రతీశీని, గతంలో నేను పోస్ట్ చేసినవి, భవిష్యత్తులో నేను పోస్ట్ చేయబోయే నా ఫొటోలను తీసుకోవడానికి.. మార్ఫింగ్, ఎడిట్ చేయడానికి నేను మీకు అనుమతి ఇవ్వడం లేదు. ఒకవేళ ఎవరైనా నా ఫొటోలను ఏదైనా విధంగా ఎడిట్ చేయమని కోరితే, దయచేసి ఆ అభ్యర్థనను తిరస్కరించండి. ధన్యవాదాలు.'అని ప్రతీకా రావల్ ట్వీట్ చేసింది.



# టెస్ట్ క్యాంప్‌తోనే టీమిండియాకు పూర్వ వైభవం: గిల్

టెస్ట్ ఫార్మాట్‌లో టీమిండియా ఘోర పరాజయాల నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)కి కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కీలక సలహా ఇచ్చాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో టీమిండియా పూర్వ వైభవం అందుకోవాలంటే ప్రతీ సిరీస్‌కు ముందు 15 రోజుల టెస్ట్ క్యాంప్ నిర్వహించాలని బీసీసీఐకి శుభ్‌మన్ గిల్ సూచించాడు. ఈ విషయాన్ని ఓ జాతీయ ఛానెల్ పేర్కొంది. గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత టెస్ట్ ఫార్మాట్‌లో టీమిండియా ఘోర పరాజయాలను చవిచూసింది. ముఖ్యంగా 2024లో న్యూజిలాండ్ చేతిలో సొంతగడ్డపై క్లీన్ స్వీప్ అయ్యింది. భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే సొంతగడ్డపై టీమిండియా క్లీన్ స్వీప్ కావడం ఇదే తొలిసారి. ఆ తర్వాత ఆస్ట్రేలియా పర్యటనలో సిరీస్ కోల్పోయి డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్‌ను చేజార్చుకుంది. ఈ పరాజయాల అనంతరం రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించడం టీమిండియాను మరింత కష్టాల్లో నెట్టింది. రోహిత్ శర్మ వారసుడిగా సారథ్య బాధ్యతలు చేపట్టిన శుభ్‌మన్ గిల్.. ఇంగ్లండ్ పర్యటనలో ముందుండి జట్టును నడిపించాడు. 754 పరుగులతో రాణించి టాప్ స్కోరర్‌గా నిలిచి సిరీస్ సమమవ్వడంలో కీలక పాత్ర పోషించాడు. ఆ తర్వాత భారత్ వేదికగా జరిగిన వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌ను కూడా భారత్ గెలిచింది. కానీ సౌతాఫ్రికాతో జరిగిన రెండు టెస్ట్‌ల సిరీస్‌లో మాత్రం మరోసారి క్లీన్ స్వీప్ అయ్యింది. వరుసగా రెండేళ్లలో రెండు సిరీస్‌ల్లో భారత్ క్లీన్ స్వీప్‌కు గురికావడం విమర్శలకు దారి తీసింది. భారత టెస్ట్ క్రికెట్ మనుగడపైనే ప్రశ్నలు తలెత్తాయి. ఈ పరాజయంపై అసంతృప్తి వ్యక్తం చేసిన బోర్డు.. టీమ్‌మేనేజ్‌మెంట్ వివరణ కోరినట్లు వార్తలు వచ్చాయి.

# ముంబై కెప్టెన్‌గా శ్రేయస్

టీమిండియా వన్డే వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ రీఎంట్రీకి మార్గం సుగుమమైంది. తీవ్ర గాయంతో కొన్ని రోజులుగా భారత జట్టుకు దూరంగా ఉన్న శ్రేయస్ అయ్యర్ పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ)లో ఇంటెన్సివ్ రిహాబ్‌ను పూర్తి చేసిన శ్రేయస్ అయ్యర్.. మ్యాచ్ ఫిట్‌నెస్ టెస్ట్‌లో భాగంగా విజయ్ హజారే ట్రోఫీ ఆడనున్నాడు. ఈ లీగ్‌లో ముంబై ఆడాల్సిన చివరి రెండు మ్యాచ్‌లకు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ విషయాన్ని ముంబై క్రికెట్ అసోసియేషన్ వెల్లడించింది. ముంబై రెగ్యులర్ కెప్టెన్ శార్దూల్ ఠాకూర్ గాయంతో జట్టుకు దూరం కావడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఐదు మ్యాచ్‌లు ఆడి నాలుగు విజయాలు సాధించిన ముంబై.. ఎలైట్ గ్రూప్ సీలో రెండో స్థానంలో కొనసాగుతోంది. మహారాష్ట్రతో జరిగిన గత మ్యాచ్‌లో ముంబై 128 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. జనవరి 6న హిమాచల్ ప్రదేశ్, 8న పంజాబ్‌తో తలపడనుంది. ఈ రెండింటిలో ఒక్క మ్యాచ్ గెలిచినా ముంబై క్వార్టర్స్ చేరుతుంది. దాంతో ఈ మ్యాచ్‌లు ముంబైకి కీలకం మారాయి. శ్రేయస్ అయ్యర్ కూడా ఈ మ్యాచ్‌ల్లోనే ఫిట్‌నెస్ నిరూపించుకోవాలి. అప్పుడే అతనికి క్లియరెన్స్ సర్టిఫికెట్ వస్తుంది. అప్పుడే జనవరి 11 నుంచి న్యూజిలాండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌లో అయ్యర్‌కు అవకాశం దక్కుతుంది.

# ట్రావిస్ హెడ్ విధ్వంసం

## ఆధిక్యతంలో ఆసీస్



ప్రతిష్టాత్మక యాషెస్ 2025–26 సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఆఖరి టెస్ట్‌లోనూ ఆసీస్ ఆధిపత్యం చెలాయిస్తోంది. ట్రావిస్ హెడ్(87 బంతుల్లో 15 ఫోర్లతో 91 బ్యాటింగ్) విధ్వంసకర బ్యాటింగ్‌తో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 34.1 ఓవర్లలో 2 వికెట్లకు 166 పరుగులు చేసింది. మరో ఓపెనర్ జేక్ వెదరాల్డ్(36 బంతుల్లో 4 ఫోర్లతో 21) నిరాశపర్చగా.. మార్నస్ లబుషేన్(68 బంతుల్లో 7 ఫోర్లతో 48) తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. మైఖేల్ నెజర్( 1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఇంగ్లండ్ బౌలర్లలో బెన్ స్టోక్స్ రెండు వికెట్లు తీసాడు. ప్రస్తుతం ఆసీస్ 218 పరుగుల వెనుకంజలో ఉంది. అంతకుముందు 211/3 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 384 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ జోరూట్(242 బంతుల్లో 15 ఫోర్లతో 160) భారీ శతకంతో చెలరేగగా.. హ్యారీ బ్రూక్(97 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 84) తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. జెమీ స్మిత్(76 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 46) హాఫ్ సెంచరీ మిస్ చేసుకున్నాడు. కెప్టెన్ బెన్ స్టోక్స్(0) డకౌటయ్యాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో మైఖేల్ నెజర్(4/60) నాలుగు వికెట్లు తీయగా.. మిచెల్ స్టార్క్, స్కాట్ బోలాండ్ రెండేసి వికెట్లు పడగొట్టాడు. కామెరూన్ గ్రీన్, మార్నస్ లబుషేన్ తలో వికెట్ తీసారు. ఈ సిరీస్‌ను ఆసీస్ 3–1తో ఇప్పటికే కైవసం చేసుకుంది. ఈ ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో ఆసీస్ వరుసగా మూడు గెలవగా.. ఇంగ్లండ్ నాలుగో టెస్ట్‌లో గెలిచి పరువు కాపాడుకుంది. ఆఖరి టెస్ట్‌లో ఇరు జట్లు సమంగా దూసుకెళ్తున్నాయి.

# 10 సిక్సర్లతో వైభవ్ విధ్వంసం

**బిత్తరపోయిన సఫారీ బౌలర్లు**



భారత సంచలనం వైభవ్ సూర్యవంశీ కెప్టెన్‌గా మరింత రెచ్చిపోయి ఆడుతున్నాడు. దక్షిణాఫ్రికా అండర్–19 బౌలర్లను వణికిస్తూ విధ్వంసక అర్ధ శతకం(68) బాదాడీ కుర్రాడు. రెండో యూత్ వన్డే లో ఆకాశమే హద్దుగా చెలరేగిన వైభవ్.. 10 సిక్సర్లతో సఫారీ బౌలర్లను బెంబేలెత్తించాడు. అతడితో పాటు అభిగ్యాన్ కుందు (48నాటౌట్) మెరుపులతో భారీ స్కోర్ చేసిన టీమిండయా డక్‌వర్త్ లూయిస్ ప్రకారం 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. కొత్త ఏడాదిలోనూ వైభవ్ సూర్యవంశీ సుడిగాలి ఇన్నింగ్స్‌లు ఆడుతున్నాడు. దక్షిణాఫ్రికాతో యూత్ వన్డే సిరీస్‌లో సారథిగా వ్యవహరిస్తున్న వైభవ్.. రెండో మ్యాచ్‌లో శివాలెత్తిపోయాడు. ప్రత్యర్థి నిర్దేశించిన 246 పరుగుల ఛేదనలో ఈ లెఫ్ట్ హ్యాండర్ పూనకాలు వచ్చినట్టు బ్యాట్‌తో విధ్వంసం సృష్టించాడు. కేవలం 24 బంతులనే ఎదుర్కొన్న ఈ యంగ్ బ్యాటర్. 10 సిక్సర్లు, ఒక్క ఫోర్‌తో 68 రన్స్ బాదేశాడు. అతడు ఔటయ్యాక.. వేదాంత్ త్రివేది(31 నాటౌట్), అభిగ్యాన్ కుందు(48 నాటౌట్)లు అజేయంగా జట్టును గెలిపించారు. డక్‌వర్త్ లూయిస్ ప్రకారం టీమిండియా లక్ష్యాన్ని 176గా నిర్దేశించగా.. 8 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. వైభవ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. తొలి వన్డేలోనూ డీఎల్‌ఎస్ పద్ధతిలోనే 19 పరుగుల తేడాతో గెలిచిన భారత్ మూడు యూత్ వన్డేల సిరీస్‌లో 2–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఇరుజట్ల మధ్య చివరి మ్యాచ్ జనవరి 7న జరుగనుంది.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
మంగళవారం 6-1-2026


# ఏఐ.. చదువుదాం!

**"డిజిటల్ తరగతులు, ఏఐ ఆధారిత బోధన, వృత్తి విద్యతో పాటు భారతీయ జ్ఞాన పరంపరకు చోటిచ్చే పాఠ్య ప్రణాళికలు 2025-26లో భారతీయ విద్యా వ్యవస్థను కొత్త దిశగా నడిపిస్తున్నాయి."**






డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం


**2025-26** కాలానికి వచ్చేసరికి భారతదేశ ఆధునిక విద్యా వ్యవస్థ చారిత్రాత్మకమైన మార్పుల దశలో ఉంది. ప్రపంచంలోనే అతి పెద్ద యువ జనాభా కలిగిన దేశంగా భారతదేశంలో 25 సంవత్సరాల లోపు జనాభా శాతం సుమారు 65 శాతంగా ఉండటం విద్యకు అసాధారణ ప్రాధాన్యం ఇస్తోంది. 2020లో ప్రకటించిన జాతీయ విద్యా విధానం ప్రభావం ఇప్పుడు పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో కంఠస్థ విద్య, మార్కుల ఆధారిత మూల్యాంకనం కేంద్రంగా ఉన్న విధానం ఇప్పుడు భావనాత్మక అవగాహన, విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, జీవన నైపుణ్యాల అభివృద్ధి వైపు మళ్లుతోంది. 2030 నాటికి పాఠశాల విద్యలో 100 శాతం స్థూల నమోదు నిష్పత్తి సాధించాలన్న లక్ష్యంతో విధానాలు రూపొందించబడగా, 2025-26 నాటికి ప్రాథమిక స్థాయిలో నమోదు శాతం 95 శాతం దాటింది. అయినప్పటికీ మధ్య, ఉన్నత పాఠశాల స్థాయిలో డ్రాప్అవుట్ శాతం ఇంకా 15 శాతం నుంచి 20 శాతం మధ్యలో ఉండటం విద్యా వ్యవస్థలోని లోపాలను స్పష్టంగా చూపిస్తోంది. విద్యను కేవలం ఉద్యోగ సాధనంగా కాకుండా వ్యక్తిత్వ నిర్మాణ సాధనంగా చూడాలన్న ఆలోచన ఆధునిక విద్యకు మూలస్తంభంగా మారింది.

**డిజిటల్ విస్తరణ, ఉన్నత విద్య మార్పులు - అవకాశాలు, అసమానతలు:**

2025-26 నాటికి డిజిటల్ విద్య భారతీయ విద్యా వ్యవస్థలో విడదీయరాని భాగంగా మారింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం పాఠశాలలు, కళాశాలల్లో సుమారు 70 శాతం వరకు డిజిటల్ బోధన పద్ధతులు ఏదో ఒక రూపంలో అమలవుతున్నాయి. ఆన్‌లైన్ వేదికలు, వర్చువల్ ప్రయోగశాలలు, మిశ్రమ అభ్యాస విధానాలు పట్టణ ప్రాంతాల్లో సాధారణంగా మారాయి. కృత్రిమ మేధ ఆధారిత అభ్యాస సాధనాలు విద్యార్థుల అభ్యాస స్థాయిని విశ్లేషించి వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా మార్గనిర్దేశం చేస్తున్నాయి. అయితే డిజిటల్ అంతరం ఇంకా తీవ్రమైన సమస్యగానే కొనసాగుతోంది. 2025 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ ప్రాప్యత సుమారు 55 శాతం మాత్రమే ఉండటం వల్ల ఆధునిక విద్య ప్రయోజనాలు అందరికీ సమానంగా చేరడం లేదు. ఉన్నత విద్య రంగంలో స్థూల నమోదు నిష్పత్తి 2025-26 నాటికి సుమారు 30 శాతం కి చేరింది. జాతీయ విద్యా విధానం ప్రకారం 2035 నాటికి దీనిని 50 శాతం కు పెంచాలన్న లక్ష్యం నిర్దేశించబడింది. అకడమిక్ క్రెడిట్ బ్యాంక్, బహుళ ప్రవేశ-నిష్క్రమణ విధానం విద్యార్థులకు చదువులో లచీలతను కల్పిస్తున్నాయి. బహుశాఖీయ విశ్వవిద్యాలయాల ద్వారా పరిశోధన, ఆవిష్కరణలకు ఊతం లభిస్తున్నప్పటికీ పరిశోధనపై ప్రభుత్వ వ్యయం జీడీపీలో కేవలం 0.7 శాతం చుట్టూ ఉండటం, అధ్యాపకుల కొరత వంటి సమస్యలు ఇంకా సవాళ్లుగానే ఉన్నాయి.

భారతదేశ విద్యా వ్యవస్థ ఎదుర్కొన్న ప్రధాన విమర్శ విద్య-ఉపాధి మధ్య ఉన్న అంతరమే. దీనిని తగ్గించేందుకు 2025-26 నాటికి స్కిల్ డెవలప్మెంట్‌ను విద్యలో కీలక భాగంగా మార్చే ప్రయత్నం జరుగుతోంది. జాతీయ లక్ష్యాల ప్రకారం ప్రతి సంవత్సరం కోట్ల మంది యువతకు నైపుణ్య శిక్షణ అందించాలన్న ఉద్దేశంతో స్కిల్ కార్యక్రమాలు విస్తరించబడ్డాయి. 2025 నాటికి పాఠశాల స్థాయిలో సుమారు 20 శాతం విద్యార్థులకు వృత్తి విద్య పరిచయం చేయాలన్న లక్ష్యం నిర్దేశించబడింది. డిజిటల్ నైపుణ్యాలు, డేటా విశ్లేషణ, గ్రీన్ జాబ్స్, పర్యావరణ సంబంధిత రంగాలు, సాఫ్ట్ స్కిల్స్ వంటి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయి. పరిశ్రమలతో భాగస్వామ్యం, ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిస్‌షిప్‌ల ద్వారా విద్యను ఉద్యోగోపయోగంగా మార్చే ప్రయత్నాలు కనిపిస్తున్నాయి. అయితే ఈ అవకాశాలు అన్ని ప్రాంతాల్లో సమానంగా అందుతున్నాయా అన్న ప్రశ్న ఇంకా మిగిలే ఉంది. మహిళల ఉన్నత విద్య నమోదు శాతం పెరిగినా కొన్ని వెనుకబడిన ప్రాంతాల్లో ఇది ఇంకా 25 శాతం కంటే తక్కువగానే ఉంది. ఆర్థిక అడ్డంకులు, భాషా సమస్యలు, ప్రాంతీయ అసమానతలు విద్యా అవకాశాలను పరిమితం చేస్తున్నాయి. మొత్తంగా 2025-26 భారతీయ ఆధునిక విద్యా వ్యవస్థ లక్ష్యాలు, గణాంకాలు, ఆశయాలతో ముందుకు సాగుతున్నప్పటికీ విధానాలు-అమలు మధ్య అంతరం ఇంకా తగ్గాల్సి ఉంది. ఉపాధ్యాయుల శిక్షణ, అమలు నాణ్యత, నిరంతర పెట్టుబడులు పెరిగినప్పుడే ఈ గణాంకాలు నిజమైన సామాజిక మార్పుగా మారతాయి. విద్య విద్యార్థి కేంద్రంగా, సమాజోపయోగంగా, భవిష్యత్ దృష్టితో ముందుకు సాగితేనే భారతదేశ అభివృద్ధికి ఇది అత్యంత బలమైన పునాది అవుతుంది. ఆధునిక విద్య లక్ష్యం కేవలం ఉద్యోగాలు పొందే యువతను తయారుచేయడం కాదు, నైపుణ్యవంతులైన, ఆలోచనాశీలులైన, బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దడమే.

మొత్తంగా పరిశీలిస్తే ఆధునిక విద్యా వ్యవస్థ భారతదేశ భవిష్యత్తును నిర్ధారించే కీలక మలుపులో నిలిచింది. 2025-26 నాటికి విద్య కేవలం పుస్తకాల పరిధిలో పరిమితమైన ప్రక్రియగా కాకుండా, సాంకేతికత, నైపుణ్యాలు, విలువలు, సంస్కృతి అన్నింటినీ సమన్వయం చేసే సమగ్ర వ్యవస్థగా రూపాంతరం చెందుతోంది. భవిష్యత్ ప్రపంచం జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థగా మారుతున్న నేపథ్యంలో, విద్యలో టెక్నాలజీని పాఠ్య ప్రణాళికలో తప్పనిసరి భాగంగా చేర్చడం ఇక ఎంపిక కాదు, అవసరం. ప్రభుత్వ అంచనాల ప్రకారం 2030 నాటికి భారతదేశంలో 70 శాతం ఉద్యోగాలు డిజిటల్ నైపుణ్యాలపై ఆధారపడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 2025-26 నుంచే పాఠశాల స్థాయి నుంచి కోడింగ్, డేటా అవగాహన, డిజిటల్ లిటరసీని పాఠ్యాంశాలలో చేర్చే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 60 శాతం పాఠశాలల్లో ఏదో ఒక రూపంలో డిజిటల్ లెర్నింగ్ అమలులో ఉన్నప్పటికీ, దీన్ని 2030 నాటికి 100 శాతం కు చేరవేయాలన్న లక్ష్యం ముందుంది.

ఇందులో కృత్రిమ మేధ లేదా ఏఐ టెక్నాలజీ విద్యారంగంలో ప్రధాన పాత్ర పోషించనుంది. 2025 నాటికి ప్రపంచ విద్యా మార్కెట్‌లో ఏఐ ఆధారిత విద్యా సాంకేతికత విలువ సుమారు 25 బిలియన్ డాలర్లకు చేరిందన్న అంచనాలు భారతదేశ విద్యా విధానాలకు దిశానిర్దేశం చేస్తున్నాయి. ఏఐ ఆధారిత బోధన విధానాలు విద్యార్థి సామర్థ్యాన్ని విశ్లేషించి వ్యక్తిగత అభ్యాస మార్గాలను రూపొందించగలవు. పరీక్షల మూల్యాంకనం, అభ్యాస లోపాల గుర్తింపు, ఉపాధ్యాయులకు సహాయక సాధనాల రూపకల్పన వంటి రంగాల్లో ఏఐ వినియోగం వేగంగా పెరుగుతోంది. 2026 నాటికి ఉన్నత విద్యలో కనీసం 40 శాతం సంస్థలు ఏఐ ఆధారిత లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లను ఉపయోగించాలన్న అంచనాలు ఉన్నాయి. అయితే ఆధునికత పేరుతో విద్యను యాంత్రిక ప్రక్రియగా మార్చే ప్రమాదాన్ని కూడా గుర్తించాల్సిన అవసరం ఉంది. అందుకే ఆధునిక విద్యా వ్యవస్థ టెక్నాలజీతో పాటు మానవ విలువలను సమానంగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యతను వహించాలి. ఈ దిశగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలను పాఠ్య ప్రణాళికలో చేర్చే ప్రయత్నం కీలకంగా మారుతోంది.

2025-26 నాటికి జాతీయ విద్యా విధానం భారతీయ జ్ఞాన పరంపరను విద్యలో అంతర్భాగం చేయాలని స్పష్టంగా సూచిస్తోంది. యోగా, ఆయుర్వేదం, భారతీయ తత్వశాస్త్రం, ప్రాచీన గణితం, ఖగోళ శాస్త్రం, స్థానిక కళలు, భాషలు వంటి అంశాలను ఆధునిక సబ్జెక్టులతో సమన్వయం చేయడం ద్వారా విద్యార్థిలో మూలాలతో అనుసంధానం పెరుగుతుంది. ప్రస్తుతం దేశంలో సుమారు 40 శాతం పాఠశాలల్లో స్థానిక సంస్కృతి ఆధారిత కార్యక్రమాలు అమలులో ఉన్నాయని అంచనా. దీన్ని 2030 నాటికి 75 శాతానికి పెంచాలన్న లక్ష్యం ముందుంది. ఆధునిక విద్యా వ్యవస్థ భారతీయతను కోల్పోకుండా గ్లోబల్ దృక్పథాన్ని అలవర్చే విధంగా ముందుకు సాగాలి. టెక్నాలజీ, ఏఐ, స్కిల్ డెవలప్మెంట్ విద్యార్థిని ఉద్యోగ మార్కెట్‌కు సిద్ధం చేస్తే, సంస్కృతి, విలువలు, నైతికత అతడిని బాధ్యతాయుతమైన పౌరుడిగా తీర్చిదిద్దుతాయి. ఈ రెండు సమన్వయం లేకపోతే విద్య అసంపూర్ణంగా మిగిలిపోతుంది. 2025-26 నుంచి అమలవుతున్న పాఠ్య ప్రణాళికలు ఈ సమతుల్యతను సాధించే దిశగా ఉండాలి. ఉపాధ్యాయుల శిక్షణలో కూడా టెక్నాలజీతో పాటు భారతీయ విలువల బోధనకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉపాధ్యాయ శిక్షణపై జీడీపీలో ఖర్చు 1 శాతం కంటే తక్కువగా ఉండగా, దీన్ని 2030 నాటికి కనీసం 2 శాతం కు పెంచాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఆధునిక విద్యా వ్యవస్థ విజయానికి ఉపాధ్యాయుడే కేంద్ర బిందువు. మొత్తంగా ఆధునిక విద్యా వ్యవస్థ భారతదేశాన్ని జ్ఞానశక్తిగా మార్చే సామర్థ్యం కలిగి ఉంది. కానీ ఈ మార్పు కేవలం డిజిటల్ పరికరాలు, ఏఐ ప్లాట్‌ఫారమ్‌లు, గణాంకాల పరిమితిలోనే ఆగకూడదు. అది భారతీయ సంస్కృతి మూలాలను బలపరుస్తూ, ప్రపంచ స్థాయిలో పోటీ పడగల మానవ వనరులను తయారుచేసే దిశగా సాగాలి. 2025-26 విద్యా సంస్కరణల అసలైన విజయ సూచిక పరీక్షల ఫలితాలు కాదు, విద్యార్థి ఆలోచనా సామర్థ్యం, నైపుణ్యాలు, విలువలు, సమాజ పట్ల బాధ్యతే. ఆధునిక విద్య లక్ష్యం ఉద్యోగాలు సృష్టించడం మాత్రమే కాదు, భవిష్యత్ భారతదేశాన్ని నడిపించే సాంకేతికంగా నైపుణ్యవంతులైన, సాంస్కృతికంగా బలమైన, నైతికంగా దృఢమైన పౌరులను తీర్చిదిద్దడమే.

# కోతులు.. పల్లెలు.. పాలకులు!



**వ్యవసాయం అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదు.. గ్రామీణ జీవనానికి ప్రాణాధారం. అయితే నేటి పరిస్థితుల్లో ఆ వ్యవసాయం రైతుకు లాభం కాకుండా భారంగా మారుతోంది. ఇందుకు ప్రధాన కారణంగా మారిన అంశం.. అదుపు తప్పిన కోతుల జనాభా. ఇది ఇక అటవీ ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన సమస్య కాదు. గ్రామాలు, పంట పొలాలు, ఇళ్ల ముంగిట వరకూ విస్తరించి. వ్యవసాయంతో పాటు గ్రామీణ జీవన విధానాన్నే కుదిపేస్తున్న తీవ్రమైన సంక్షోభంగా మారింది. ఒకప్పుడు పల్లెల్లో ప్రతి ఇంట్లోనూ తీగజాతి కూరగాయలు, ఆకుకూరలు, వంకాయ, మిర్చి, టమాట వంటి పంటలు సహజంగా పండేవి.**




కాలగిరి శ్రీనివాసరెడ్డి
సీనియర్ జర్నలిస్ట్


**ఇం**టి అవసరాలకు సరిపడేంత కూరగాయలు ఇంటి ముందర పందిళ్ళు, పొలాల గట్ల వెంట ఉండేవి. నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కోతుల బెడద కారణంగా గ్రామాల్లో కూరగాయల సాగు దాదాపు అంతరించిపోయింది. ఇక కూరగాయలకే పరిమితం కాకుండా మొక్కజొన్న, మిర్చి, కంది, పెసర, వినుము వంటి పంటలు కూడా కోతుల ధ్వంసానికి గురవుతున్నాయి. పంటలు పండే దశలోనే కోతులు పొలాల్లోకి దూసుకెళ్లి నాశనం చేస్తున్నాయి. రైతు పెట్టిన పెట్టుబడి కళ్లముందే మట్టిపాలవుతుండటంతో సాగు చేయాలనే ఉత్సాహమే కోల్పోతున్నాడు.

ఇది కేవలం పంట నష్టంతోనే ఆగడం లేదు. కోతులు ఇళ్లలోకి చొరబడి ధాన్యాలను, వంట సామగ్రిని ధ్వంసం చేయడం, పిల్లలు, వృద్ధులపై దాడులకు పాల్పడటం వంటి ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయి. గ్రామాల్లో భయాందోళన వాతావరణం నెలకొంది. గ్రామాల్లో ప్రజలు కోతుల భయంతో బతికే పరిస్థితి దాపురించడం అత్యంత ఆందోళనకరం. కూరగాయలు, పప్పుధాన్యాలు, ఇతర వాణిజ్య పంటలు సాగు చేయలేని పరిస్థితుల్లో రైతులు తప్పనిసరిగా వరి పంట వైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ఒకే పంటపై ఆధారపడే ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. వరి సాగు విస్తృతంగా పెరగడంతో యూరియా వినియోగం విపరీతంగా పెరిగింది. దీనివల్ల యూరియా కొరత, భూసార నాశనం, భూగర్భ జలాల కాలుష్యం, సాగు వ్యయం పెరుగుదల వంటి సమస్యలు రైతును మరింత కుంగదీస్తున్నాయి. వ్యవసాయం లాభసాటిగా కాకుండా అప్పుల కూపంగా మారుతోంది. ఈ సమస్య తీవ్రతను ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికలే స్పష్టంగా ప్రతిబింబించాయి. ముఖ్యంగా సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు అభ్యర్థుల ముందు ఉంచిన ప్రధాన సమస్య "కోతుల బెడద" కావడం గమనార్హం. రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి అంశాలకంటే ముందుగా.. "కోతుల నుంచి గ్రామాన్ని ఎలా కాపాడతారు?" అనే ప్రశ్నే ప్రధానంగా వినిపించింది. పలువురు అభ్యర్థులు తాము గెలిస్తే కోతుల సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇవ్వడం, ఈ సమస్య ఎంత తీవ్రమైందో స్పష్టంగా తెలియజేస్తోంది. కోతుల సంఖ్యను నియంత్రించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కొనసాగితే, వ్యవసాయం మాత్రమే కాదు.. గ్రామీణ జీవన విధానం మొత్తం కూలిపోయే ప్రమాదం ఉంది. ఈ సమస్యను ఇకపై అటవీ శాఖ పరిధిలోని అంశంగా కాకుండా, వ్యవసాయ అత్యవసర సమస్యగా ప్రభుత్వం పరిగణించాల్సిన అవసరం ఉంది. కోతుల సంఖ్యను శాస్త్రీయంగా అంచనా వేయడం, కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయడం, అడవులు, గ్రామాల మధ్య రక్షణ చర్యలు తీసుకోవడం, పంట నష్టానికి తగిన పరిహారం ఇవ్వడం, పంట మార్పిడి విధానాలను ప్రోత్సహించడం వంటి చర్యలు తక్షణమే చేపట్టాలి. లేకపోతే రైతు సాగు మానేస్తాడు.. గ్రామాలు ఖాళీ అవుతాయి.. ఆహార భద్రతకే ముప్పు ఏర్పడుతుంది. అప్పుడు వ్యవసాయం పండగగా కాదు, దండగగా మారిపోతుంది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గ్రామీణ ప్రజలు ఒకటే విజ్ఞప్తి చేస్తున్నారు.. ఈ సమస్యను తక్షణమే పరిగణలోకి తీసుకుని, సమగ్ర విధానంతో పరిష్కరించాలి. లేకపోతే పంటల నాశనం, రైతుల నిరుత్సాహం, వ్యవసాయ వ్యవస్థ పతనం అనివార్యం. ఇది హెచ్చరిక కాదు.. వ్యవసాయ భవిష్యత్తును కాపాడుకునేందుకు ఇచ్చే గట్టి సంకేతం.




## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811



OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.